# శ్రీ పూండి స్వామి వారి దివ్య చరిత్ర

సేకరణ: పెసల సుబ్బరామయ్య

శ్రీ పూండి స్వామి వారి దివ్య చరిత్ర

సర్వస్వామ్యములు - సాయి మాస్టర్ సేవాట్రస్ట్ వారివి.
2005 సం|| - 2000 కాపీలు

**కాపీల కొరకు:**

శ్రీ సాయిమాస్టర్ సేవాట్రస్ట్
గొలగమూడి (PO)
నెల్లూరు జిల్లా - 524 321

ఈ గ్రంధము శ్రీ శివకాంతన్‌గారి సౌజన్యముతో
వారి తమిళ గ్రంధమునుండి సేకరించబడినది.

# ముందుమాట

నేను దర్శించిన మహాత్ములందరిలో శ్రీ పూండి స్వామి వారివలె తమకొక దేహమున్నదన్న విషయమే పట్టనివారు లేరు. వారంతా దేహభ్రాంతి నతిక్రమించారుకానీ అప్పుడప్పుడూ మన శరీరపరిమితికి దిగివచ్చి వ్యక్తులను గుర్తించి వారితో వ్యవహరించేవారు. కానీ శ్రీ పూండి స్వామి వారు అలా వ్యక్తులతో వ్యవహరించడం, వారిని ఫలానా వారని గుర్తించడం చాలా అరుదుగా ఉండేది. ఈ మహనీయుని నుండి దివ్యానుభవాలు పొందిన భక్తులు కోకొల్లలుగా ఉండినా ఎక్కువమంది తమ అనుభవాలు చెప్పేందుకు నిరాకరించారు. అనుభవాలు చెప్పిన కొద్దిమంది కూడ వారి పేర్లు చెప్పేందుకు నిరాకరించారు. గనుక కొద్ది అనుభవాలు మాత్రమే సేకరించగలిగానని వ్రాశారు తమిళ రచయిత శ్రీ శివకాంతన్‌గారు. మహా సముద్రమువంటి వారి లీలా తరంగిణి నుండి మనకు లభించిన చిన్న నీటి బొట్టు వంటి ఈ చిన్న పుస్తకాన్ని చదివి ఆ మహనీయునకు నివాళులర్పిద్దాం.

శ్రీ వారి పాదరేణువు

## పూండికి వెళ్ళే మార్గము

పూండి తమిళనడులోని గ్రామం

1. తిరువణ్ణామలై నుండి పూండికి బస్సులున్నాయి.
2. తిరుపతి నుండి తిరువణ్ణామలై వెళ్ళే బస్సు ఎక్కి కలశపాకంలో దిగి పూండి వెళ్ళే బస్సు ఎక్కాలి. లేక కలశపాకం నుండి రెండు కి.మీ. నడవాలి.



# శ్రీ పూండి స్వామి వారి చరిత్ర

## గురుస్తుతి

నిర్గుణం, నిష్కళం, నిత్యం, నిర్వికల్పం, నిరంజనం అయిన ఆ పరమాత్మే భక్త సంరక్షణ కొరకు సగుణ సాకారంలో అనేకచోట్ల సద్గురు మూర్తులుగా అవతరించి తమ అవతార కార్యాలను కొనసాగిస్తారు. వీరికి జాతి, కుల, మత భేదాలుండవు. ప్రపంచము లోని సర్వజీవులూ వారే గనుక వారు మతాతీతులుగా ఉండడం చూస్తాము. శ్రీ పూండి స్వామివారిని అన్ని మతముల భక్తులు సేవించేవారు.

ఈ మహనీయుని దర్శించి సేవించిన మా గురుదేవులు పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజగారు అనేకమంది భక్తులను శ్రీ పూండి స్వామివారి దర్శనార్థం పంపేవారు. కొందరిని వారి దగ్గర నలభై రోజులు దీక్ష చేయమనేవారు. నేనెప్పుడు వారి దర్శనార్థం వెళ్తానన్నా ఇప్పుడు వద్దు. ఆ ప్రాంతానికి పనిమీద వెళ్ళినప్పుడు పొమ్మనేవారు. నేనొకప్పుడు పదవ తరగతి పరీక్ష పేపర్లు దిద్దేందుకు చిత్తూరు వెళ్ళాను. అక్కడనుండి శ్రీ పూండి స్వామి వారి దర్శనార్థం వెళ్ళాను. శ్రీ స్వామి వారి చేతిలో భక్తులు పెట్టిన డబ్బును పిల్లలు పెరుక్కొని వెళ్ళేవారు. వాళ్ళలా తీసుకపోకుండా చూచేందుకు అక్కడొక గుమస్తాను నియమించియున్నారు. నాకు ధ్యానం సరిగా కుదరడంలేదని - ధ్యానం కుదిరేటట్లుగా అనుగ్రహించమని ఆ గుమస్తా ద్వారా వాళ్ళ భాషలో చెప్పించాను. అందుకు శ్రీ స్వామి వారు మరలా రమ్మని చెప్పారు. తెల్లవారి పూండినుండి వచ్చేశాను. మరుసటి సంవత్సరము కూడా పేపర్లు దిద్దేందుకు చిత్తూరు వెళ్ళాను. ఇప్పుడు మరలా శ్రీ స్వామి వారిని దర్శించాను.

ఇప్పుడు కూడా ఆ గుమస్తా ద్వారా నాకు ధ్యానం సరిగా కుదరడంలేదని పోయిన సంవత్సరం వస్తే మరలా రమ్మన్నారని శ్రీ స్వామివారికి విన్నవించాను. అందుకు శ్రీ స్వామివారు "బాగుంటుందిపో" అనే ఒక్కమాట అన్నారు. తెల్లవారి అక్కడనుండి ఇంటికి వచ్చేశాను. గురుదేవులైన శ్రీ భరద్వాజగారు "భగవంతుడు నిజంగా మననుంచి కోరేది మన కాలము, మనస్సు. గనుక సాధ్యమైనంతసేపు వాటిని భగవంతునకివ్వు" అని చెప్పేవారు నిత్యం ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు పటాల దగ్గర కూర్చుంటాను తప్ప, ధ్యానం సరిగా కుదిరేదిలేదు. ఇంకా 8 ½ గంటలేనా ఇంకా 8 ¾ గంటలేనా అని ఎప్పుడెప్పుడు 9 గంటలు అయితే లేచిపోదామా అని ఎదురుచూచేవాడిని. శ్రీ పూండి స్వామి వారి నుండి వచ్చాక మరురోజునుండి ఊహాతీతంగా ధ్యానం కుదరసాగింది. 9 గంటల 45 నిమిషాలు అయినా బాహ్యప్రపంచమే తెలిసేది కాదు. 10 గంటలకు స్కూలుకు పోవాలి గనుక ఇంట్లో వాళ్ళు తలుపు తట్టి గోలచేస్తే లేచేవాడ్ని. ఆ మహనీయుని నోటినుండి వచ్చిన ఒక్కమాట వల్ల మూడు సంవత్సరములనుండి నా ప్రయత్నముతో అలవిగాని ధ్యానం ఎంతో ఘాఢంగా కుదిరేటట్లు చేసింది. ఈ ఒక్క అనుభవముతో ఆ మహనీయుని ఎడల నా పూజ్యభావము ఎంతో తీవ్రం కాజొచ్చింది. అందుకే ఈ చిన్న పుస్తకం ద్వారా లోకానికి వారి గురించి చెప్పసంకల్పించాను. ఈ మహనీయుని గొప్పతనం గురించి వ్రాయడం నాలాంటి అల్పునకు సాధ్యముకాదు. కానీ వ్రాసినంతసేపైన నా మనస్సు నిశ్చలంగా వారి దివ్యపాదముల చెంత ఉండగలదనే ఆశతో వ్రాస్తున్నాను. పాఠకుల మనస్సు కూడా అలాగే వారి దివ్యపాదముల చెంత ఉండాలని కోరుతాను.



## శ్రీ స్వామివారిలో నేను దర్శించిన వింతలు:

1. శ్రీ స్వామివారు మద్రాసు రాష్ట్రములోని తిరుమణ్ణామలై జిల్లాలోని పూండి అనే గ్రామములో ఒక పెంకుటింటి వరండాలో కూర్చొని యుండేవారు. శ్రీ భరద్వాజ మాష్టర్‌గారు చెప్పేవారు - "శ్రీ స్వామివారు తాను కూర్చున్న తావునుండి ఏ అవసరార్ధము పన్నెండు సంవత్సరాలు ప్రక్కకు జరిగి ఎరుగరు" భక్తులే వారి చంకలలో చేతులు వేసి లేపి ప్రక్కన కూర్చోబెట్టి, అప్పటివరకు ఉన్న పరుపులు తీసేసి ఎండలో ఆరబెట్టి మరొక జత పరుపులు వేసేవారు. ఒక పరుపు పరిచేవారు. మరొక దాన్ని చుట్టి వారి వెనుక ఆనుకునేందుకని పెట్టేవారు. మలమూత్ర విసర్జనకు కూడా లేచేవారుకాదు. ఆహారము ఎంత తింటారో ఎంత మలవిసర్జన చేస్తారో అనే విషయం శ్రీ స్వామివారి సేవకంకితమైయున్న సేవకునకే తెలుస్తుంది. నిత్యం ఆ సేవకుడే ఆ పరుపు ముసుకులను, శ్రీ స్వామిపైకప్పిన ఉత్తరీయాన్ని తీసుకవెళ్ళి పూండి నదిలో ఉతికి ఎండబెట్టి తెచ్చేవారు.
2. తనకొక శరీరం ఉన్నది అనే భ్రాంతే వారికి ఉండేదికాదు. ఒక భక్తుడు వచ్చి క్రిష్ణముడి వేసి ఆ ముడికి పూలు చుట్టి నామంపెట్టి పోతాడు. వారు వెళ్ళినాక మరొక భక్తుడు వచ్చి క్రిష్ణముడి విప్పి, నామం తుడిపేసి - ఈశ్వరునకు చుట్టినట్లు వెంట్రుకలు చుట్టి విభూతి రేఖలు ముఖాన, చేతులకు, ఛాతీమీద తీస్తాడు. ఇలాగే అనేకులు అనేక విధాలైన అలంకారాలు చేస్తే దేనినీ వద్దనరు. దేనినీ కావాలని కోరరు. బొమ్మలాగా కూర్చొని ఉంటారు.
3. బొటనవ్రేలు - చూపుడువ్రేలు మధ్యన భక్తులు కరెన్సీ (డబ్బు) కాగితాలు ఉంచేవారు. వారలాగే పట్టుకొని ఉంటారు. మరొకరు వచ్చి అవి తీసుకపోతున్నా ఏమీ అనరు.

4. పిల్లి ఇంటి దూలం మీదనుండి శ్రీ స్వామి వారి భుజం పై దూకి కూర్చుంటుంది. దానిని వారేమీ అనరు. భుజం మీదనుండి దూలం మీదకు దూకుతుంది. అప్పుడూ ఏమీ అనరు.

5. ఈ పిల్లి శ్రీ స్వామి వారికి కప్పిన ఉత్తరీయాన్ని తన గోళ్ళతో ప్రక్కకు తోసేస్తుంది. ఎంత చలైనా అలాగే కూర్చొనుంటారు. వంటిమీద ఒక్క దారం పోగైనా ఉండదు. ఒక రాత్రివేళ మూత్ర విసర్జనకు లేచిన నేను శ్రీ స్వామి వారిని చూడాలని గోతాము పట్టలతో వేసిన కర్టెను రంధ్రములద్వారా చూచి ఆశ్చర్యపోయాను. ప్యాంటు, డ్రాయరు, బనియను, షర్టు, చలిచొక్కా, దుప్పటి, తలకు ఉలన్ మఫ్లరు వేసియున్న నేను చలికి వణికిపోతూ ముడుక్కుపోయాను. కానీ శ్రీ స్వామి వారు తన కండ్లు స్పష్టంగా తెరిచి, చూపు ఎక్కడో లయించి చూస్తున్నారు. వారి భుజము పై పిల్లి ఉంది. శరీరం పై ఒక్క ఆచ్ఛాదన లేదు. దిగంబరంగా చక్కగా కూర్చొనియున్నారు. వారికి శరీరము ఉందనే భ్రాంతే లేదు. అందుకే అలా ఉండగలిగారు.

6. శ్రీ స్వామివారు ఆ ఇంటి వరండాలో వదలకుండా కూర్చోసాగినాక ఆ ఇంటివారు ఆ ఇంటిని శ్రీ స్వామివారికి వదలి మరొక ఇంటిలోకి కాపురం మార్చారు. శ్రీ స్వామివారికి భక్తులు సమర్పించిన పూలు అరటిపండ్లు, మామిడి పండ్లు, ద్రాక్ష లాంటి పండ్లు టెంకాయ చిప్పలూ సర్వం ఆ ఇంటిలో వేయించేవారు. మామూలుగా అయితే ఆ పండ్లు, పూలు కుళ్ళిపోయి ఎంతో దుర్వాసన రావాలి. కానీ ఆ ఇల్లు మొత్తం నిండినంతవరకు ఏ వాసనా లేదు. ఆ ఇల్లు నిండినాక ఎవరు నివేదించే వస్తువులు తిరిగి వారికే ఇచ్చేసేవారు.



## ఒక సేవకుడు శ్రీ స్వామి వారి సేవకు రావడం గురించి శ్రీ భరద్వాజమాష్టరుగారు చెప్పిన విషయం

ఒక సాధకుడు హిమాలయాల్లో సాధన చేసుకుంటూ ఒక స్థితికి వచ్చారు. అటు తర్వాత తానెన్నాళ్ళు సాధనచేసినా ఆపై స్థితికి పోలేకున్నాడు. అప్పుడు వారు తానున్న స్థితినుండి పై స్థితికి వెళ్ళే మార్గము చెప్పమని అనేకమంది కాషాయధారులను అర్థిస్తూ అనేక చోట్లలో తిరుగుచుండేవాడు. ఎవ్వరూ చెప్పలేకపోయారు. ఒక మహనీయుడు కన్పించి - "నీవు మద్రాసు రాష్ట్రములోని పూండి గ్రామములో వేంచేసియున్న స్వామి వారిని ఆశ్రయిస్తే నీకు మార్గము చెప్పగలరు" అని సలహా ఇచ్చారు. ఆ సాధకుడు ఎంతో శ్రమపడి పూండి గ్రామము వచ్చి చూడగా తనకు హిమాలయములలో సలహా చెప్పిన మహనీయుడే పూండిలో ఉన్న పూండి స్వామి అని గుర్తించి ఆనందాశ్చర్యములు తనను ముంచెత్తగా శ్రీ పూండి స్వామి వారి సేవకంకితమయ్యారు.

ఈ మహనీయుడు శ్రీ స్వామి వారికి సేవ చేయడం చూచి తీరవలసినదే కానీ వ్రాయలేము. రోడ్డుకు మూడడుగుల ఎత్తులో ఉన్న ఇంటి వరండాలో శ్రీ స్వామి వారు కూర్చొని ఉంటారు. వచ్చిన వారు వారి వారి ఇష్టానుసారం, అభిరుచినుసరించి వారిని తాకి వెంట్రుకలు దువ్వి నామాలు కానీ విభూతి రేఖలు గానీ పెట్టి వెళ్ళేవారు. వెంటనే మరియొకరు వచ్చి అదేపని చేయబోతే ఈ హిమాలయములనుండి వచ్చిన సేవకుడు, శ్రీ స్వామి వారిని తాకి అలాచేయవద్దని ప్రాధేయపడేవారు. ఆ వచ్చినవారు వారిని లెక్కలేకుండా మాట్లాడి తమ ఇష్టప్రకారం శ్రీ స్వామివారిని అలంకరించి వెళ్ళేవారు.

ఈ సేవకుడు ఎప్పుడూ రోడ్డుమీద కూర్చొని మూడడుగుల ఎత్తు వరండాలో కూర్చున్న శ్రీ స్వామి వారిని ప్రతి రెండు నిమిషాలకు లేచి చూస్తూ వారి పై నున్న ఉత్తరీయాన్ని సరిచేస్తూ ఉండేవారు. రెండు నిమిషాలవ్యవధిలో శ్రీ స్వామి వారుకి ఏమైపోతుంది? అప్పుడప్పుడూ కొంతసేపు నిలుచున్నా, కాళ్ళు నొప్పిగనుక కూర్చోక తప్పదు. ఆ కూర్చున్నప్పుడు పై విధంగా రెండు నిమిషాల వ్యవధిలో లేచి చూచుకునేవారు. సాయినాధుడు చెప్పినట్లు - "నా గురువును చూస్తుంటే నాకు ఆకలిదప్పులు తెలిసేవికావు" అని. ఇదే ఈ సేవకుని విషయంలోనూ నిజమని తెలుస్తుంది.

ఈ సేవకుడే చిన్న ప్లేటులో ఏదో ప్రసాదం కొంచెం తీసుకొని దాన్పై అరిటాకు దాన్పై మరొక ప్లేటు మూతగా వేసి తెచ్చేవాడు. శ్రీ స్వామివారి ముందున్న గోతాము కర్టెను లాగి వేసేసి - చిన్న చిన్న గోలీలంత ముద్దలు చేసి శ్రీ స్వామి వారి నోటికి అందించేవారు. వారు ఒక్కొక్కసారి మింగేవారు, ఒక్కొక్కసారి మింగరు. అప్పుడా ప్రసాదం వెనక్కు తీసుకవెళ్ళేవాడు.

ఈ విశాల విశ్వమే తానైయున్న శ్రీ పూండి స్వామి వారిని ఈ విధంగా సేవించి ఈ సేవకుడు ధన్యమయ్యాడు. వారిసేవకు సంప్రీతుడైన శ్రీ స్వామివారు ఈ సేవకుని సంపూర్ణముగా అనుగ్రహించి యుంటారు.

నేను ప్రథమంగా శ్రీ పూండి స్వామి వారిని దర్శించినప్పుడు అక్కడ ఒక తెలుగు తెలిసిన వ్యక్తి కనిపించి శ్రీ స్వామివారి దివ్యలీలనొకదానిని వివరించారు. శ్రీ స్వామివారి చరిత్ర ఆనాటికి అచ్చయి వెలుగుచూడలేదు.



ఆ ప్రాంతములోని ఒక లక్షాదికారికి చాలా గొప్పఖరీదు చేసే ఉంగరము ఎక్కడో పోయింది. ఆ ఉంగరమును ఆయన ఎవరో ఉంపుడుగత్తెకిచ్చారని ఆయన భార్య అనుమానించి వేదించసాగింది. చివరకు ఆయనతో పలకడమే లేదు. ఉంగరము పోయినందుకు బాధలేదుకానీ నిర్దోషినైన తనను తన భార్య అనుమానించి పలకకుండా ఉన్నందుకు ఆయన తీవ్రంగా బాధపడసాగాడు. ఏ పనీ చేయలేడు. మనసు మనసులో ఉండదు. చాలా చిత్రహింసకు గురియైనాడు. ఒక మిత్రుని సలహాపై శ్రీ పూండి స్వామివారి దర్శనానికి వచ్చాడు. శ్రీ స్వామి కూర్చున్న ఇంటిప్రక్కనున్న బావి దగ్గర స్నానం చేసి తడిబట్టలతో శ్రీ స్వామివారి ముందు నిల్చొని నమస్కరించాడు. ఆయన ఏమి చెప్పుకోకుండానే శ్రీ స్వామివారు "జలదారి గుంటలో చూచుకోపో" అన్నారు. అతనికి వెంటనే దాని అర్ధం మనసుకు తోచింది. ఇంటికి వెళ్ళి జలదారిగుంట మూత తీయించి మురికి నీరంతా తీయిస్తే తన ఉంగరం ఆ గుంటలో దొరికింది. తానేమీ చెప్పుకోకుండానే తన బాధనెరింగి దానికి పరిష్కారము చెప్పి రక్షించిన శ్రీ స్వామి వారి ఎడల తన కృతజ్ఞతను ఈ క్రింది అన్నదాన కార్యక్రమముద్వారా ప్రతిఏటా తనకు ఉంగరము దొరికిన రోజు తెలిపేవారు. అలాంటి అన్నదాన కార్యక్రమము, శ్రీ స్వామి వారి చిత్రపట ఊరేగింపు మనమెక్కడ చూడబోమని చెప్పారు.

## అన్నదానము, చిత్రపటము ఊరేగింపు

ప్రతి సంవత్సరమూ తనకు ఉంగరము దొరికిన రోజున అన్నదానము, చిత్రపట ఊరేగింపు జరిపేవారు. పూండి గ్రామములోని పెద్ద పెద్దమానులన్నీ సీరియల్ సెట్ లైట్లతో అలంకరించేవారు.

శ్రీ స్వామి వారున్న ఇల్లు ఆ వీధి అలంకరించడం సహజం. కానీ ఈ ధనవంతుడు ఇల్లు, వీధేగాక ఆ గ్రామమంతా అలంకరించేవాడు. నాలుగుచోట్ల షడ్రసోపేతమైన అన్న సంతర్పణ జరిపేవారు. ఆ గ్రామస్తులేగాక వచ్చిన యాత్రికులందరూ ఎక్కడపడితే అక్కడ చక్కగా భోంచేస్తారు. ఆ గ్రామములో జరిగే శ్రీ స్వామి వారి చిత్రపట ఉత్సవం మనమెక్కడా చూడబోము. ఎన్నిరకాల వాయిద్యాలు ఉన్నాయో అన్ని రకాల వాయిద్యాలు రావలసిందే. గొప్ప గొప్ప గాయనీ గాయకులచే పాట కచ్చేరీలు ఏర్పాటు చేసేవారు. ఈ వినోధ కార్యక్రమాలను అన్న సంతర్పణలను అనుభవించవలసిందే కానీ వర్ణించ వీలులేనివి. ఇంత వైభవమైన కార్యక్రమాలు జరుగుతున్నా గానీ శ్రీ స్వామివారు తనకేమీ పట్టనట్లు నిర్వికారంగా దిగంబరంగా ఆ అరుగుపై అలా చూపు ఎక్కడో లయింపజేసి కూర్చోనుండేవారు.

## శ్రీ పూండి స్వామి వారి దివ్యచరిత్ర

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టరు గారు చెప్పినట్లు - ఏ మహనీయుడైనా తన తల్లిదండ్రులు, పుట్టిన గ్రామము, తేదీ, గురువుగారి పేరు చెప్పలేదు. ఉదా: శ్రీ సాయిబాబా షిరిడీ; అక్కల్‌కోట మహరాజ్; మాణిక్య ప్రభువు; మాయి అమ్మ. అలాగే శ్రీ పూండి స్వామి వారి గతచరిత్ర ఎవ్వరికీ తెలియదు. అనేకమంది భక్తులు ప్రయత్నించి కూడ తెలుసుకోలేకపోయారు. వీరు తమిళనాడు లోని తిరువణ్ణామలై - (శ్రీ రమణ భగవాన్ ఆశ్రమం) జిల్లా, కలశపాకం అనే గ్రామానికి 1965 సం|| ప్రాంతంలో విచ్చేశారు. వీరు కలశపాకం రాకముందే ఆ ప్రాంతములో ఉన్న శ్రీ గురునాధన్ అనే గొప్ప సిద్ధపురుషుడు ఎంతో ఆనందంగా పాటలు పాడుతూ, మహరాజు



వస్తున్నాడు, మహారాజు వస్తున్నాడు దారివ్వండి. వర్షం వస్తుంది, వర్షం వస్తుంది గొడుగుపట్టండి అని చేతులు తడుతూ పాటలాగా పై మాటలు పాడేవారు. నిజంగానే నాలుగురోజులలో శ్రీ పూండి స్వామివారు కలశపాకం విచ్చేశారు. అంతకుముందు ఆరునెలలుగా లేని వర్షం ఒక్కసారి కుండపోతగా కురిసింది.

శ్రీ పూండి స్వామి వారు కలశపాకం వచ్చేసరికి షుమారు ఇరవై సంవత్సరముల వయస్సు ఉంటుంది. చొక్కాపై చొక్కా ధరించి, భుజాన మాసిన గుడ్డల మూట వ్రేలాడవేసుకొని, పుసికండ్లతో, మలిన వస్త్రములతో, తైల సంస్కారము, స్నానము లేని శరీరముతో, చురుక్కున చురకవేసే కన్నులతో, దివ్య వర్చస్సుతో వెలిగిపోయేవారు. వీరు అక్కడికి వచ్చినది మొదలు అక్కడున్న నాగజెముడు పొదలలో కూర్చొని ఉండేవారు.

అక్కడి రైతులు వీరిని గమనించి ఆ నాగజెముడు పొదలను కొట్టి వీరిని బయటతీసుకవచ్చారు. ఎవ్వరితో ఏమీ మాట్లాడరు. అన్నం, నీరు కావాలని ఎవ్వరినీ ఏమీ అడగరు. తనకు తీవ్రంగా ఆకలైనప్పుడు నాగజెముడు పండ్లు, నదిలోని ఇసుక తినేవారు. ప్రక్కనున్న నదిలోను కాలువ గట్టుపైన ఎండ, వాన లెక్క చేయక రోజుల తరబడి యోగనిష్ఠలో ఉండేవారు.

శ్రీ స్వామివారు కలశపాకం నదిలోని ఇసుకలో, ఎంతటి ఎండైనా కదలకుండా ఒక మొద్దువలె పడుకొని ఉండేవారు. వారి శరీరంపై చీమలు బేర్లు బేర్లుగా ప్రాకుతుండేవి. స్కూలు పిల్లలు వీరిని కదిలించాలని ఎంత ప్రయత్నించినా కదిలించలేకపోయారు. అతి విచిత్రమైన సంఘటన చూచినవారు చెపుతున్నారు - శ్రీ స్వామి వారి

పాదము నుండి చీమలు రంధ్రమువేసి ఆ రంధ్రాన్ని మోకాటి చిప్పవరకు తెచ్చి అక్కడొక రంధ్రము చేసి బయటికి వచ్చేవి. వీరి కాలిలోని రక్తమాంసాలను అవి ఆరగిస్తుంటే శ్రీ స్వామి వారికి ఆ స్పురణే ఉండేది కాదు. ఆనాడు రావణుడు తపస్సు చేస్తుంటే శరీరమంతా శిధిలమై పుట్టలు మొలిచాయని, కేవలం ఎముకలే ఉన్నాయని ఈ విధమైన తపస్సు చేసిన వారిని నేను చూడనే లేదని బ్రహ్మ వారిని మెచ్చుకొని వారికి తిరిగి దివ్య శరీరమే గాక కోరిన వరాలన్నీ ఇచ్చారని మనం చదవడమే కానీ చూడలేదు. అలాంటి స్థితిలో శ్రీస్వామి వారుండగా చూచినవారు అనేకులు ఇంకా జీవించేయున్నారు.

ఒకప్పుడు వీరు ఏటిలో కూర్చొని సమాధి స్థితిలో ఉండగా ఏరుపారి ఆ నీటికి కొట్టుకవచ్చిన ఇసుకలో శ్రీ స్వామివారు కూరుకుపోయారు. అటు తర్వాత ఇసుక తోలుకపోయే బండ్లవాళ్ళు ఇసుకను పారలతో తీస్తుంటే శ్రీ స్వామివారు ఇసుకలో నుండి లేచిపోతున్నారు. గనుక శ్రీ స్వామివారికి ఏటి స్వామి అని కూడా పేరు.

శ్రీ స్వామి వారు అప్పుడప్పుడూ సింహగర్జనవలే అరచేవారు. అలాంటప్పుడు ప్రజలు ఆ శబ్దానికి భయపడి వారిని సమీపించేవారు కాదు. ఒక్కొక్కప్పుడు రోజుల తరబడి అన్నము, నీరు, నిద్ర లేకుండా సూర్యుని చూస్తూ వెల్లకిల పడుకొని అలాగే ఉండేవారు.

ఒకరోజు ఇద్దరు రైతులు వచ్చి శ్రీ స్వామి వారికి తమ కుటుంబ సమస్యలు చెప్పుకున్నారు, అది విని శ్రీ వారు - పశువులు గడ్డి తిన్నట్లు మనుషులెందుకు మట్టి తినాలి అని పలుమార్లు అన్నారు. ఆ మాటలు వారికేమీ అర్థంకాక వెళ్ళిపోయారు. ఆ వచ్చిన రైతులలో ఒకడు తెల్లవారి



మరణించాడు. ఈ విషయం విన్న అనేకులు వీరు పిచ్చివారు కాదు చాలా గొప్ప మహాత్ములని భావించారు.

ఒకసారి కలశపాకం విద్యార్థులు వచ్చి స్వామీ మేము పరీక్షలు పాసవుతామా? అని అడిగారు. అందుకు శ్రీ స్వామివారు పాసవుతారు, పాసవుతారు అని ముమ్మారు పలికారు. వారందరూ అలాగే పాసయ్యారు. ఒకరోజొక విద్యార్థిని చూచి "రాండి జడ్జిగారూ" అని పిలిచారు. ఆ విద్యార్థి పెద్దవాడై తిరువణ్ణామలైలో జడ్జిగా ఉద్యోగం చేశారు. కొంతమంది అదృష్టవంతులకు వీరు భవిష్యత్తు కూడా ఒకటి రెండు మాటలలో చెప్పేవారు. భయంకరంగా ఉన్న వీరి కండ్లలోని పుసులు, ముక్కులలో కారే చీమిడి, మాసి చండాలంగా ఉన్న వీరి చినిగిన బట్టలు, స్నానం లేక దుమ్ము కొట్టుకొనియున్న శరీరము చూచి ఎవ్వరూ వీరి చెంత చేరేవారు కాదు. గనుక వీరి యోగానికి ఆటంకముండేదికాదు.

కాకంకర్త్రి గ్రామ వినాయక గుడి దగ్గర ఉన్న కట్టెలదొడ్డి ప్రక్కన శ్రీ స్వామివారు ఎప్పుడూ కూర్చోసాగారు. వారి పుసికండ్లు, చీమిడి ముక్కులు, పిచ్చివేషము చూచి ఆ కట్టెలదొడ్డి ఆసామి శ్రీ స్వామి వారిని దూరంగా వదలి రావాలని తలచాడు. శ్రీ స్వామి వారిని ఆరణి మార్గములోని చైయారు అనే గ్రామములో బస్టాండులో వదిలేసి వెంటనే బస్సెక్కి తన కట్టెలదొడ్డి చేరాడు. శ్రీ స్వామివారు యధాతదంగా తన స్థానంలో కూర్చొనుండడం చూచి దిగ్భ్రమచెందాడు. అక్కడున్న వారంతా శ్రీ స్వామివారు ఉదయం నుండి ఇక్కడే ఉన్నారు, వారు మీతోటి చైయారు ఎప్పుడు వచ్చారని చెప్పడంతో ఆ కట్టెలదొడ్డి ఆసామికి మతిపోయినంత పనయింది. అది మొదలు శ్రీ స్వామి వారు

మరలా అక్కడికి రాలేదు. ఆ కట్టెలదొడ్డి ఆసామి నష్టాలపాలై చాలా కష్టాలు పడ్డాడు.

వారక్కడ కూర్చోవడం తనకిష్టం లేకుంటే ఆ మాట వారికి చెప్పి వేరొక చోటికి పొమ్మని చెప్పవచ్చు కానీ శ్రీ స్వామి వారినే మోసంతో తీసుకవెళ్ళి మరొకగ్రామంలో వదలిపెట్టి వారికి చెప్పకుండా రావడం ఎంతటి అపచారం. వారు మహనీయులు కానిదే తనకంటే ముందు రాలేరని తెలిసిన తర్వాతనైనా వారికి క్షమాపణ చెప్పియుంటే అంతటి కష్టాలు వచ్చియుండవు. అతని మోసపు ప్రవృత్తి, అహంకారమే అతని కష్టాలకు కారణమైంది.

పూండి గ్రామంలో వారు వరండాలో కూర్చోసాగాక అనేకులు వారి దర్శనార్థం వస్తున్నారు. మరి ఆ యింటివారు శ్రీ స్వామి వారిని లేచి వెళ్ళమని చెప్పలేదు. వారే ఆ ఇల్లు శ్రీ స్వామివారికి వదిలేసి మరొక ఇంటిలో చేరారు. ఆ ఇంటి ఆసామి ఎంతటి గొప్ప మేలు పొంది ఉంటారో మన ఊహకే అందదుగదా!

శ్రీ స్వామివారు ఒక మసీదు దగ్గర కూర్చొనియుండగా ఒక ముస్లిమ్ యువకుడు కమలాపండు వలచి ఒక్కొక్క దబ్బ శ్రీ స్వామివారి నోటిలో పెడుతున్నాడు. ఒక దబ్బ శ్రీ స్వామివారు మింగాక రెండు దబ్బలు శ్రీ స్వామివారి నోటినుండి క్రింద పడుచున్నాయి. ఇలా కొంతసేపు జరిగాక ఇది చూస్తున్న ఒక పెద్ద మనిషి "ఇదేమిటి స్వామీ మీకు ఒక దబ్బ పెడితే రెండు దబ్బలు మీ నోటినుండి క్రింద పడుతున్నాయి" అని అడిగారు. అందుకు శ్రీ స్వామి వారు "ఇతడు ఒకటికి రెండుగా ఎదురు చూస్తున్నాడయ్యా" అన్నారు. అది విన్న ముస్లిమ్ యువకుడు" స్వామీ నన్ను మన్నించండి. నేను కట్నానికి



ఆశపడి భార్య ఉండగనే మరొక పెండ్లి చేసుకోవాలనుకొని మీ ఆశీర్వాదము కోరి వచ్చింది నిజమే అని కాళ్ళ మీద పడ్డాడు. ఆశతోనైనా సరే మహనీయుల నాశ్రయిస్తే మనలను సన్మార్గములో ఎలా నడిపిస్తారో ఈ లీల తెలుపుతుంది. ఆ ముస్లిమ్ యువకుడి మనసు మారి రెండవ వివాహం మానుకున్నాడు.

శ్రీ పూండి స్వామి వారి నుండి బహిర్గతమైన ఒక్కొక్క లీల ఆ ప్రాంత ప్రజలలో క్రమక్రమంగా శ్రీ స్వామి వారి ఎడల పూజ్యభావము భక్తి శ్రద్ధలను జాగృతం చేశాయి. పిల్లారు పచ్చపనాయనార్, దొరస్వామి మొదలియార్, తంగవేలు నాయనార్, మాణిక్యనాయనార్, శ్రీ వెల్లయన్ అనేవారు శ్రీ స్వామివారు ఎక్కడున్నా వెతికి వారికి అన్నం పెట్టేవారు. ఒకరోజు శ్రీ వెల్లయన్ గారు రాత్రి తొమ్మిది గంటలకు శ్రీ స్వామి వారికి అన్నం తీసుకవెళ్ళారు. నిత్యం శ్రీ స్వామివారు కలశపాకంలోని ఈశ్వరుని గుడియొద్ద ఉండేవారు, ఆ రోజు వెల్లయన్ వచ్చేసరికి శ్రీ స్వామివారు ఆ మందిరంలోని ఒక స్థంబము దగ్గర క్రింద పడుకొని యున్నారు. వెల్లయన్ దగ్గరకు వెళ్ళేసరికి అక్కడ శ్రీ స్వామి వారికి బదులు ఒక పులి దర్శనమైంది. అతను భయంతో పరుగుతీశాడు. ఈ దివ్యలీలను విన్న జనం శ్రీ స్వామి వారు నిజంగా పిచ్చివారు కాదని ఒక దైవస్వరూపమని భక్తి శ్రద్ధలతో నమస్కరించసాగారు. వారి నమస్కారములకు శ్రీ స్వామివారు కన్నెత్తి కూడా చూచేవారు కాదు. వారిలోకంలో వారుండేవారు.

ఎప్పుడూ ఒక మాసినగుడ్డల మూటను చంకకు తగిలించుకొని, అనేక చొక్కాలు ఒకదానిపై మరొకటి ధరించి, మోకాళ్ళ వరకు కట్టిన మాసిన దోవతితో నడిచేవారు. వారి నడక ఏనుగు నడకవలె ఎంతో - ఠీవిగా ఉండేది. వారెంతో వేగంగా నడిచేవారు. వారితోటి అంత వేగంగా

ఎవ్వరూ నడవలేకపోయేవారు. చేతులు విసురుకుంటూ నడిచేవారు. ఎవ్వరినీ ఏమీ అడగరు. ఎవరైనా టీ ఇస్తే తాగేవారు. అప్పుడప్పుడూ కలర్ షోడా ఎవరైనా ఇస్తే తాగేవారు. వారికై వారు అవి కావాలని అడిగేవారు కాదు. కలశపాకం వెంకటాచలంశెట్టియారు ఒక గ్లాసు గంజి ఇస్తే శ్రీ స్వామివారు దాన్ని ఆనందంగా తాగేవారు. కలశపాకం, మేటపాలయం, పిల్లూరు లాంటి గ్రామాలలో తిరిగేవారు. కానీ ఏనాడూ ఎవ్వరినీ ఏదీ అడిగేవారు కాదు. ఎవరైనా వారికై వారే ఇస్తే ఒక్కొక్కప్పుడు స్వీకరించేవారు. వారు ఆకలై తినాలంటే ఎప్పుడూ ఏటిలోని ఇసుక కంకర రాళ్ళు, నాగజెముడు పండ్లు రెడీగా ఉండనే ఉన్నాయిగదా!

శ్రీ స్వామి వారు నడిస్తే రోజుల తరబడి నడిచేవారు. కూర్చుంటే ఇక అక్కడ నుండి లేచేవారు కాదు. చేతులు ఊపడం మొదలు పెడితే రోజుల తరబడి ఊపుతుండేవారు.

## తీరని కడుపునొప్పి

తంజావూరు జిల్లా మాయవరం నుండి ఒక భక్తుడు తీరని కడుపునొప్పితో శ్రీ స్వామిని ఆశ్రయించాడు. అతడు చేయని వైద్యము, చూడని డాక్టరూ లేరు. యంత్ర, తంత్ర, మంత్రాలన్నీ విఫలమయ్యాయి. అతడు కందర్‌నాడీ జోస్యము చెప్పించుకున్నాడు. "మీ పూర్వీకులు ఒక మందిరం నొత్తు తిన్నారు. అందువలన నీకీ వ్యాధి సంక్రమించింది. నీవు, తిరువణ్ణామలైకి పడమట వైపు గల చిన్న పల్లెటూరిలో ఒక బ్రహ్మజ్ఞాని ఉన్నారు, ఒక గురువారం వారికి ఒక గ్లాసు పాలు సమర్పిస్తే నీ బాధ నివారణౌతుంది" అని చెప్పాడు. నాకు శ్రీ స్వామి వారి విషయం తెలియదు గనుక గత నెలరోజులుగా అన్నీ గ్రామాలు వెతికి చివరకు శ్రీ స్వామివారిని పూండి గ్రామంలో



దర్శించాను. ప్రక్కనున్న నదిలో స్నానం చేసి ఒక గ్లాసు ఆవుపాలు శ్రీ స్వామివారికి సమర్పిస్తే ఆ మహనీయుడు వాటిని స్వీకరించక తీసివేయమన్నారు. ప్రక్కనున్న ఒక సన్యాసి ఆ పాలు స్వీకరించి అతని బాధ నివారించమని శ్రీవారిని ప్రార్థించాడు. "ఎవరు చేసిన ఖర్మకు ఎవరు బాధ్యులెట్లా అవుతారో చూడండి అని అతనిని మరొకసారి రమ్మని చెప్పు. పాపాలన్నీ కొంచెం కొంచెంగా కడిగివేయాలి. కర్మతో వచ్చినది ధర్మంతోనే పోవాలి" అన్నారు. ఆ భక్తుడు నిత్యం శ్రీస్వామి వారిని, మోకాళ్ళ మీద నడిచివచ్చి దర్శించేవారు. ప్రతి గురువారం ఆవుపాలు నివేదించేవాడు. కొన్ని వారాల తర్వాత అతని కడుపునొప్పి పూర్తిగా లేకుండా పోయింది.

ఈ లీలలో శ్రీ స్వామివారి మాట యొక్క అర్థం అల్పజ్ఞులమైన మనకు చక్కగా బోధపడక వాళ్ళ పూర్వీకులు దేవుని మందిరం నొత్తు తింటే ఇతనికి కడుపు నొప్పి రావడమేమిటి అని మనందరికి శ్రీ స్వామి వారి మాటలు అర్థరహితాలుగా కనిపిస్తాయి. ఈ కడుపు నొప్పి భక్తుని శరీరం ఎలా పుట్టి, పెంచి పోషించబడిందో మనం ఆలోచించాలి. ఇరవై సంవత్సరముల వయసు వరకు వాళ్ళ పూర్వీకుల ఆస్థి నుండి వచ్చే రాబడితో పెరిగింది. గనుక ఆ పూర్వీకుల కర్మ కొంత వీరికికూడా తగుల్కొన్నది. ఇలాగే మన పూర్వీకులు చేసిన దాన ధర్మాలు పుణ్యాల ఫలితం కూడా మనకు సంక్రమిస్తుందని తెలుస్తుంది.
ఉదా: శ్రీ వెంకయ్య స్వామి చరిత్రలో - చెర్లోపల్లి శేషయ్యనాయుడు గారిని కరెంటు షాకు నుండి ప్రాణహానిని తప్పిస్తారు. ఇట్టి శ్రీ స్వామివారి కృపకు పాత్రులయ్యేటట్లు చేసింది శేషయ్యనాయుడు గారి తల్లిగారు శ్రీ స్వామివారికి అనేక రోజులు నిత్యం రాత్రిపూట ఏ టైంలో వచ్చినా తృప్తిగా అన్నం పెట్టిన పుణ్యమే కారణము.

ఈ సృష్టిలోని సర్వమూ ఆ పరమాత్మ తత్వమే. మహానీయులు ఆ పరమాత్మ తత్వంతో తాదాత్మ్యం పొంది ఉంటారు. జీవుల యొక్క కర్మ ఫలితాలవల్ల వారికి అనారోగ్యమేర్పడుతుంది. మహానీయులు తమ సంకల్పముతో ఎంతటి మొండి వ్యాధినైనా నయం చేయగలరు. అయితే మన పాపఫలం కంటే గొప్ప పుణ్య ఫలముంటేనే వారలా సంకల్పిస్తారు. కొన్ని కొన్ని కర్మలు ఆయా వ్యక్తులు కొంతైనా అనుభవించి తీరాల్సినవిగా ఉంటాయి. అలాంటి కర్మలకు మనం మహానీయుల సన్నిధిలో మన శరీరానికి సాధన ద్వారా శ్రమ గల్గించినప్పుడు ఆ మహానీయులు కరుణిస్తారు.

ఉదా: ఒక వ్యక్తి ఊరంతా అప్పులు చేసి పారిపోతుంటే అతనిని కట్టేసి కొట్టబోయేటప్పుడు వాళ్ళ అన్న వచ్చి అతని బాకీలు తాను కడితే అతనిని వదిలేస్తారు. ఇలాగే మహానీయులు తమ తపోశక్తిని దారబోసి ఆయా వ్యక్తుల రోగాలు తగ్గిస్తారు.

మరొకడు ఒక వ్యక్తిని బాగా చితకగొట్టాడు. ఈ దెబ్బలు తిన్న వ్యక్తి ఇంక కొందరు స్నేహితులతో కలసి తనను కొట్టిన వానిని కట్టేసి కొట్టబోతుంటే అతని అన్నవచ్చి "అయ్యా మా వాణ్ణి కొట్టవద్దు, వాడికి బదులు నన్ను కొట్టండి" అంటే వాళ్ళేమంటారు - ఓరి బుద్ధిలేనివాడా నిన్నెందుకు కొడతాము. అతడు నన్ను కొట్టాడు గనుక నేను అతనినే కొడతాను అంటాడు. గనుక మనం మహానీయులనాశ్రయించినా వారు కృపజూపినా కొంతైనా బాధ అనుభవించక తప్పదు. మనం శ్రద్ధగా ప్రదక్షిణలు, పొర్లుదండాలు, మోకాళ్ళ మీద నడవడాలు, ఉపవాసాలు, నామస్మరణ పారాయణ వగైరాలాంటి సాధనలద్వారా మహనీయులను మెప్పించాలి.



ఒక్కొక్కప్పుడు మన పాప ఫలితాన్ని మరుసటి జన్మకు మార్చడం కూడా జరుగుతుంది. మరుసటి జన్మకాకపోయినా ఈ జన్మలోనే మరొక భవిష్యత్ కాలమునకు మహానీయులు మన కర్మఫలం మార్చవచ్చు. అలా మార్చకుంటే మనకుండే భక్తివిశ్వాసాలు కాస్త నశించిపోతాయి. ఇప్పుడు మన బాధలు తీరాయి గనుక భగవత్ శక్తిపై భక్తివిశ్వాసాలు కలిగి పుణ్యమార్జిస్తాము. కర్మ సిద్ధాంతం, మహనీయుల కరుణ, దైవ నిర్ణయాలనుగూర్చి మంచి అవగాహన ఏర్పడి ఎంతటి కష్టములోనైనా దైవం పై భక్తి విశ్వాసాలు కోల్పోని స్థితికి వస్తాము. అప్పుడు మనమే మన కర్మను కోరి అనుభవిస్తాము. శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ రమణ మహర్షుల రాచ రణాలు శ్రీ వెంకయ్య స్వామి వారికి కాళ్ళు పట్టుకపోవడం, పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ (శ్రీ భరద్వాజ మాస్టర్ గారి సతీమణి) గారు అస్వస్థతను అనుభవించినట్లు అనుభవిస్తాము.

## ధనసింగ్ షుగర్ వ్యాధి

వేలూరు నేతాజీ మార్కెట్టులో గోతపు సంచులు వ్యాపారికి షుగర్ వ్యాధి. ఎందరో స్పెషలిస్టులకు చూపాడు, ఎన్నో మందులు తిన్నాడు, ఎంతో డబ్బు ఖర్చయింది. డాక్టర్లు చెప్పిన పత్యం బాగా పాటించాడు. కానీ షుగర్ మాత్రం అణుమాత్రం తగ్గలేదు. స్నేహితుని బలవంతంపై శ్రీ పూండి స్వామి వారిని దర్శించి తన బాధ విన్నవించాడు. అతనివైపు తీక్షణంగా చూచి ఇతనికి చక్కెర జబ్బులేదు అన్నారు. కానీ అక్కడున్న పూజారి మరలా శ్రీస్వామి వారిని అతని షుగర్ వ్యాధి పోగొట్టమని అర్ధించాడు. అందుకు శ్రీ స్వామి "అయ్యా, అతనికి షుగర్ జబ్బు లేనేలేదు" అన్నారు.

ధనసింగ్ పరీక్షలు చేయించుకుంటే శరీరములో ఉండవలసిన చక్కెరకంటే తక్కువ మోతాదులో ఉన్నదని చెప్పారు. నాటినుండి శ్రీ స్వామి వారిని తన గురువుగా భావించి ఆరాధించసాగాడు.

ఒకరోజు ధనసింగ్ శ్రీ స్వామి వారిని తన అంగడికి దయచేయమని శ్రీ సుబ్రమణ్యం ద్వారా అడిగించాడు. "నేను వారి అంగడికి పోవడంలేదని ఎవరు చెప్పారు" అని శ్రీ స్వామి వారన్నారు. వాళ్ళ అంగడిలో ధనసింగ్ పూజించే ఫోటో రూపంలో నిత్యం వారి సేవలందుకుంటున్నారని అందరూ గ్రహించారు. ఆనాడే కాదు ఈనాడు అంటే మహా సమాధి అనంతరం కూడా శ్రీ స్వామివారు తన నాశ్రయించి తన చిత్రపటాన్ని పూజించే వారిని రక్షిస్తున్నారని అర్దమవుతుంది.

చెన్నైకి దగ్గరలోని ఒక పల్లెనుండి ఒక తొమ్మిది సంవత్సరాల వయస్సు గల పిల్లవానిని తీసుకొని శ్రీ స్వామి వారి దగ్గరకొచ్చారు. ఆ పిల్లవానికి మాటలు రావు. అందరు డాక్టర్ల ప్రయత్నాలు విఫలమయ్యాయి. శ్రీ స్వామివారాబిడ్డకు విభూతినిస్తూ "మాటలు వస్తాయి. కానీ కొంత టైం పడుతుంది" అని చెప్పారు. ఆ దంపతుల విశ్వాసానికి నిదర్శనగా వారు పూండిలోనే కాపురముంటూ నిత్యం భక్తి శ్రద్దలతో ఇడ్లీలు స్వయంగా తయారు చేసి శ్రీ స్వామి వారికి నివేదించేవారు. కొన్నాళ్ళకు ఆ బిడ్డ గొప్ప తమిళ కవిలాగా తయ్యారైనాడు. ఆ దంపతులు ఆనందపారవస్యములో శ్రీ స్వామి వారికెంతైనా దక్షిణగా సమర్పించాలని తలచారు. శ్రీ స్వామి వారు చెప్పారు గదా - "బిక్షకుడనైన నాకు ధనమక్కరలేదు. ధనం ఇవ్వవలసినది వైద్యునకు, ఉపాధ్యాయునకు, చాకలి, మంగలి వారి సేవలకు మాత్రం తప్పక ఇవ్వాలి, బిక్షకుడనైన నాకది తగదు" అని



పాఠం చెప్పారు. శ్రీ స్వామి వారెంత గొప్పగా ధనానికి దూరంగా ఉన్నారో తెలుస్తుంది. అందుకే భక్తులు తన వేళ్ళ మధ్య పదులు, వందలు విలువైన కరెన్సీనోట్లు గుచ్చి పోయినా వారినేమనరు. ఆ కరెన్సీ నోట్లను పిల్లలు పెరుక్కు పోయినా ఏమనేవారు కాదు.

ఒక సంపన్నుడు కుటుంబసమేతంగా శ్రీ స్వామి వారి దర్శనానికి వస్తూ ఒక బండెడు మిఠాయిలూ, పండ్లు తీసుకవస్తున్నాడు. మార్గమధ్యంలో నడచి వస్తున్న ఒక అమ్మాయిని తమ బండిలో ఎక్కించుకొని పూండికి తీసుకవస్తున్నారు. వీళ్ళు తెచ్చే మిఠాయిలు, పండ్లూ చూచి ఆ బిడ్డ పది పైసలకు ఒక చక్కెర బిళ్ళకొని శ్రీ స్వామి వారికివ్వాలని తెస్తుంది. పూండి చేరాక ఆ సంపన్నుడు తెచ్చిన మిఠాయిలు, పండ్లు చూచి తన పదిపైసల చక్కెర బిళ్ళను శ్రీ స్వామివారికి ఇచ్చేందుకు ఆ బిడ్డ సిగ్గు పడింది. శ్రీ స్వామివారు ఆ సంపన్నుడు తెచ్చిన మిఠాయిలు, పండ్లూ తాకనుగూడా తాకలేదు. ఆ పాప తెచ్చిన మిఠాయిని తానే స్వయంగా అడిగి తీసుకొని తిన్నారు.

భగవంతుడు భక్తికి బందీగదా! ఆ సంపన్నుడు తనకు అధికంగా ఉన్న ధనాన్ని శ్రీ స్వామి వారికి మిఠాయిలు కొనేందుకు ఖర్చు పెట్టాడు. కానీ ఆ పేద బిడ్డ తనకు కొనుక్కొని తినమని తల్లిదండ్రులిచ్చిన పది పైసలు తాను తినకుండా శ్రీ స్వామి వారికి ఖర్చు పెట్టింది. గనుక శ్రీ స్వామి వారి ఎడల ఆమెకుగల ప్రేమ భక్తికే శ్రీ స్వామి వారు బందీ అయ్యారు.

తిరుక్కోయిలూర్ నుండి సంతానార్థులై వచ్చిన దంపతులతో "చెడుపనులు చేసి వచ్చినవారికి ఈ బిక్షువు ఏమి చేయగలడు" అని శ్రీ స్వామివారన్నారు. కానీ ఆ దంపతులు కన్నీటితో అర్థించాక

విభూతినిచ్చి "బిడ్డ పుడతాడు పోండి" అని సెలవిచ్చారు. తమకు సంతానం కలిగితే శ్రీ స్వామి వారి సన్నిధిలో నామకరణం చేసుకుంటామని విన్నవించుకొని వెళ్ళారు.

మగపిల్లవాడు జన్మించాడు. కానీ మూగవాడుగా ఆరు సంవత్సరములు గడిచాయి. శ్రీ స్వామి సన్నిధిలో నామకరణం చేసేమాటే ఆ దంపతులు మరచిపోయారు. ఎన్నెన్నో వైద్యశాలలు, యంత్ర తంత్రాలు విఫలమైనాయి. చివరకు శ్రీ పూండి స్వామి వారి సన్నిధికొచ్చారు. నామకరణం విషయం శ్రీ స్వామి వారు చూచాయగా చెప్పినా వారికి అర్థం కాలేదు. చివరకు శ్రీ స్వామివారే ఆ విషయం విపులంగా వారికి అర్థమయ్యేటట్లు చెప్పారు. ఆ దంపతులు తమ తప్పును క్షమించమని వేడుకున్నారు. పూండిలోనే కొన్నాళ్ళు ఉంటే అంతా చక్కబడుతుందని చెప్పారు. వారు పూండిలో ఒకవారం ఉండగానే ఆ బిడ్డ చక్కగా మాట్లాడసాగాడు.

సర్వ వ్యాపకుడు, సర్వసమర్థుడైన శ్రీ స్వామి వారు వారిని పూండిలోనే ఉంటే అంతా చక్కబడుతుందని అనడంలోని భావం మనకెలా తెలుస్తుంది. భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారు కూడా అనేకమందిని గొలగమూడిలోని తన సమాధి మందిరం దగ్గర ఉంటే ఆరోగ్యము బాగుంటుందని స్వప్నాలలో చెపుతున్నారు. ఇల్లు వదలి మహనీయుల సన్నిధిలో ఉంటే కొన్ని కష్టాలు, అసౌకర్యాలు తప్పవు. కానీ ఆ కష్టాలు ద్వారా మన చెడు కర్మను కరిగించి మనకు శాంతి, సుఖాలను ఇస్తారని అర్థమవుతుంది.

మధుర నుండి ముగ్గురు మిత్రులు శ్రీ స్వామి వారి దర్శనార్థం వస్తూ శ్రీ స్వామి వారికని ఒక పూల మాల కొన్నారు. వారిలో ఇద్దరు



"ఈ పూలమాల చాలా బాగుంది, దీనిని నటరాజ స్వామి వారి కర్పిస్తే ఎంత బాగుంటుందో కదా" అన్నారు. మూడవ వారు "ఆ దండను శ్రీ పూండి స్వామి వారి కని గదా కొన్నాము. వారికే సమర్పించాలి" అని అన్నాడు.

శ్రీ స్వామి వారికా పూలమాల సమర్పించబోగా శ్రీ స్వామి వారు "దానిని శ్రీ నటరాజ స్వామికి అర్పించండి" అన్నారు. ఆ ముగ్గురు వారి సర్వజ్ఞత్వానికి అచ్చెరువొంది క్షమాపణ వేడారు. అప్పుడు శ్రీ పూండి స్వామి వారిలా అన్నారు.

అక్కడ ఉన్నదే ఇక్కడ ఉన్నది
ఇక్కడ ఉన్నదే అక్కడా ఉన్నది

అక్కడ ఇక్కడా ఉన్నది ఒక్కటే కదా. సర్వదేవతా రూపమే సద్గురుడని తెలుపుచున్నారు.

జ్ఞానమార్గము తెలుపమన్న సాధువుతో ఇలా అన్నారు.

ఇద్దరు భార్యలకు రెండు మాంగల్యాలు కట్టు
కాళ్ళు నెమ్మదిగా పట్టుకో
మామిడికాయలు రాలగొట్టు
విశ్రాంతి గదికి వెళ్ళు.

ఇద్దరు భార్యలంటే ఇష్టము, అయిష్టము అనే ద్వంద్వాలను వశము చేసుకో. కాళ్ళు పట్టుకోవడమంటే సద్గురు నాశ్రయించు, మామిడి కాయలు రాలగొట్టడమంటే కోరికలు వదలడం, విశ్రాంతి

గదికి వెళ్ళడమంటే శాంతిని, జ్ఞానాన్ని పొందమని అర్థం గాబోలు. శ్రీ స్వామివారు ఇంకా ఇలా అన్నారు. కప్పకూడా తల్లి బెకబెకలు అర్థం చేసుకుంటుంది. మనం శబ్దం చేస్తే దారి నుంచి తప్పుకుంటుంది. నీవుగూడా గురువు మాటను తెలుసుకొని ఆచరిస్తే జ్ఞానాన్ని పొందుతావు అని కాబోలు.

ఒకనాటి రాత్రి 9 గంటల పైన అక్కడున్న భక్తులతో "ఎంత దారుణం, ఎందుకిల చేస్తారు. మానవ జన్మ చాలా అరుదుగా దొరుకుతుంది. ఇంటికి వెళ్ళు అన్నీ చక్కబడతాయి" అని అన్నారు. ఆ మాటల అర్థం ఎవ్వరికీ తెలియలేదు.

మరుసటి రోజు ఉ. 11 గంటలకు సైన్యం నుండి వచ్చిన ఒక వ్యక్తి అర్ధోకణం వచ్చి శ్రీ స్వామి వారి పాదాలపైబడి "కరుణామయుడవైన ఓ ప్రభూ! నీవిచ్చటే ఉండి సర్వలోకాలలోని జీవులనుద్ధరిస్తున్నావా!" అని కన్నీరు కారుస్తున్నాడు. అక్కడున్న వారికి తన దీనగాథనిలా వివరించాడు. "నేనొక కడు బీదవాడను. కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్యే శరణ్యమని రైలు క్రింద పడాలని రైలు పట్టాలపై నడుస్తున్నాను. ఈ మహనీయుడు నన్ను బలవంతంగా అక్కడనుండి లాక్కుపోయి ఒక గుంటలో వదలి "మానవ జన్మ పూర్వపుణ్యం వల్ల చాలా అరుదుగాలభించేది మాత్రమే. ఇలా వ్యర్థం చేయకూడదు. ఇంటికి వెళ్ళు అన్నీ చక్కబడతాయి" అని చెప్పారు. నా ఆత్మహత్యా ప్రయత్నం మాని ఇంటికి వెళ్ళాను. వెళ్ళగానే నాకు తెలిసిన ఒక ఆంగ్లో ఇండియన్ నెలకు రూ. 750 ఇచ్చే ఉద్యోగంలో చేరమని చెప్పాడు. మూడు రోజుల తర్వాత చేరుతానని చెప్పి శ్రీ స్వామి వారి దర్శనానికి వచ్చాను" అని తన దీనగాథను వివరించాడు.



ఆ వ్యక్తి తనకు ఉద్యోగమిప్పించమని శ్రీ స్వామి వారిని ప్రార్థించకపోయినా ఆ కరుణామయుడు అతని ఆత్మహత్యా ప్రయత్నాన్ని మాన్పించడమే గాక ఉద్యోగం కూడా చూపించాడు. కరుణ అంటే ఎలా ఉంటుందో నిస్వార్థంగా కరుణ చూపడమంటే ఎలాగో మానవాళికి శ్రీ స్వామి వారు తన ఆచరణ ద్వారా నేర్పుతున్నారు.

శ్రీ స్వామి వారు ఒక్కొక్కసారి చేతులు ఊపుతూ ఉండేవారు. కొన్ని రోజులపాటు నిలపకుండా అలా ఊపుతూనే ఉండేవారు. ఒక్కొక్కసారి నిలపకుండా తల ఊపేవారు. ఈ మహనీయుడు చేతులు ఊపడం తల ఊపడం చూచిన సామాన్య మానవులు "ఈయనేమి స్వామి? ఇలా ఉన్నాడు" అనే ఏహ్యాబావంతో మరలా వారిని దర్శించేవారు కాదు.

భగవంతుడు మన నుండి కోరే మనస్సు, కాలము వారికి అర్పించకుండా సిగరెట్లు, టీ లు మొదలగు శారీరక అవసరాలెన్నో శ్రీ స్వామి వారికి సమర్పించే జనం ఎక్కువగా దర్శించేవారు.

ప్రతినిత్యం ఒక పాలవాడు పాలు, టీ, కాఫీ ఏవైనా కావాలేమోనని శ్రీ స్వామి వారినడిగేవారు. ఏమీ వద్దని నిత్యం శ్రీ స్వామివారు చెప్పేవారు. ఒక రోజు ఆ పాలవాని సైకిల్‌కు తగిలించి ఉన్న ఇరవై ఐదు లీటర్ల పాలక్యాను తెమ్మన్నారు. తేగానే ఆ క్యానులోని పాలన్నీ శ్రీ స్వామివారు ఒక్క సారిగా త్రాగేశారు. ఆ పాలవాని సైకిల్‌కున్న మరొక ఆరు లీటర్ల పాలక్యాను తెమ్మని ఆ పాలు కూడా తాగేశారు. ఈరోజు ఖాతాదారులకు పాలు ఎలా చేయాలా అనే ఆలోచనతో అతడు వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళగానే శ్రీ స్వామి వారు ఆ పాలన్నీ తిరిగి నేలపై కక్కేశారు. ఈ పాలు ఎంతమంది తాగుతారు. వాళ్ళంతా ఏమయిపోవాలని అని చెపుతూ ఆ పాలలో చచ్చి ఉన్న బల్లిని, తేలును చూపించారు శ్రీ స్వామివారు.

తమిళనాడు ముఖ్యమంత్రి అన్నాదురైగారు మరణించడముతో నిన్నటిరోజు అంగళ్ళన్నీ మూతవేశారు. ఆ పాలన్నీ టీ అంగళ్ళకు పోసే వీలులేక ఆ పాలను ఫ్రిజ్‌లో పెట్టి ఈ రోజు అంగళ్ళకు పోసేందుకు తీసుకపోతున్నాడు. ఆ పాలలో బల్లి, తేలు పడి చచ్చి ఉన్నందున ఆ పాలన్నీ చెడిపోయాయి. ఆ పాలు ఎవరు త్రాగినా విషపూరితం గనుక ప్రాణహానే. ఈ విషయం ఎవరూ చెప్పకపోయినా సర్వజ్ఞులైన ఆ కరుణామయులు అంతమంది ప్రాణాలు కాపాడారు. మన ప్రార్థనతో నిమిత్తము లేకుండానే భక్త రక్షణ చేసే కరుణామయులు శ్రీ స్వామివారు.

సద్గురువులు సర్వవ్యాపకులు, సర్వజ్ఞులు, సర్వసమర్థులుగా ఉంటారు. సర్వత్ర ఉన్నవారు ప్రతి జీవియొక్క హృదయాంతరాళములో ఉంటూ ఆ జీవి మాటలు, పనులు మాత్రమే గాక వారి సర్వ ఆలోచనలను గూడ సాక్షిగా వింటూ తగు ఫలితాలనిస్తూ ఉంటారు. మనమీ విశ్వంలో ఎక్కడ ఏమి మాట్లాడినా, ఏ ఆలోచన చేసినా వారికి తెలుస్తూ ఉంటుంది. ఈ విషయం బాగా గుర్తుపెట్టుకొని మనం నడుచుకుంటే గొప్ప ఫలితం పొందుతాము. అట్టి ఎరుక మనలో లేకుంటే వారు అనంత కరుణతో మనకు ప్రసాదించిన కృప యంతయున్ బూడిదలో పోసిన పన్నీరౌతుంది.



నెల్లిమేడు శివరామ గోవిందు భార్య శ్రీ స్వామి వారికి మంచి భక్తురాలు. మా ఆవు సుఖంగా ఈనితే శ్రీ స్వామి వారికి ఒక గ్లాసు నిండా పాలు సమర్పిస్తానని మొక్కుకున్నది. ఆవు ఈనిన తర్వాత తన కుమార్తె ద్వారా శ్రీ స్వామి వారికి పాలు పంపుతుంది. ఇంటి యజమాని ఆ బిడ్డతో "పండ్లు తోముకోని ఆ స్వామికి పాలెందుకివ్వడం" అని అన్నాడు. కానీ ఆ పాప పాలు తీసుకవెళ్ళింది. ఆ పాపను చూస్తూనే శ్రీ స్వామి వారు "మీ ఇంట్లో పళ్ళుతోముకునే స్వామికి పాలు ఇవ్వు నాకు వద్దు" అన్నాడు. ఆ పాప వెళ్ళి ఆ మాట వాళ్ళ నాన్నకు చెప్పగానే ఆయన పశ్చాత్తాపంతో పాలు తీసుకవెళ్ళి శ్రీ స్వామి వారికి ఇచ్చి క్షమించమని వేడుకున్నాడు. కానీ శ్రీ స్వామి వారు "నేను పళ్ళు తోముకున్నప్పుడు పాలు త్రాగుతాను. ఇప్పుడు వద్దు తీసుకపో" అని కసిరారు. ఈ విశ్వంలో అనుక్షణమూ ఎక్కడ ఏమి జరిగేది తనకు తెలుస్తుంటుందని శ్రీ స్వామి వారు నిరూపిస్తున్నారు.

ఆరణి నుండి ఒక భక్తురాలు శ్రీ స్వామి వారి దర్శనార్థం వస్తూ ఒక డజను అరటిపండ్లు తీసుకున్నది. వెంటనే ఒక కోతి వచ్చి సగం అరటి పండ్లు పెరుక్కుపోయింది. ఆమె చాలా బాధపడింది. ఆ కోతిలో కూడా ఆత్మ ఉంది గదా అనుకొని సరిపెట్టుకున్నది.

శ్రీ స్వామివారిని దర్శించి మిగిలిన అరటి పండ్లను వారికి సమర్పించేందుకు వెనుకాడుతుంది, అప్పుడు శ్రీ స్వామి వారు "ఇందులో కూడా ఆత్మ ఉంది. ఈ ఆత్మ కూడా తింటాడు. ఆ అరటి పండ్లు ఇవ్వు" అని అడిగి స్వీకరించారు. ఎక్కడో ఆమె మనసులో మెదిలిన భావం కూడా శ్రీ స్వామివారికి తెలుస్తుందంటే వారు సర్వవ్యాపకులు, సర్వజ్ఞులని తెలుస్తుంది.

ఆమె తన కుటుంబ సమస్య పరిష్కరించుకుందామని వచ్చింది. చాలామంది ఉన్నందున విభూతి తీసుకొని ప్రక్కన నిలుచున్నది. అక్కడికి వచ్చిన దంపతులు నమస్కరించి స్వామి నా భార్య కడుపు నొప్పి నయం చేయండి అని అడిగాడు. అందుకు శ్రీ స్వామివారు వెయ్యిమంది అత్తలతోనైనా వేగవచ్చు కానీ ఒక్క ఆడపడుచుతో వేగలేమబ్బా.

**దంపతులు:** మేము అందరు వైద్యులు, అన్ని దేవాలయాలు చూచాము. కానీ నొప్పి నయం కాలేదు. దయ చూపండి స్వామీ.

**స్వామి వారు:** పంట పెరిగింది. తినేవారు లేరు, పిచ్చుకలు తింటాయిలే.

ఆ దంపతులకు శ్రీ స్వామివారి మాటలు అర్థం కాలేదు.

**ఆ రెడ్డమ్మ చెప్పింది:** నా కుమార్తె పెండ్లి కాని ఆడపడుచుతో వేగలేక చస్తుంది. ఆ మాటలన్నీ నాకు జవాబులు, మీకు విభూతినిచ్చారు గనుక మీ నొప్పి పోతుందని చెప్పి అందరూ వారికి నమస్కరించి వెళ్ళిపోయారు.

శ్రీ స్వామి వారికి మనం మన సమస్య వివరించనక్కర లేదు. ఆ సర్వజ్ఞమూర్తి మన సమస్య తెలుసుకోవడమేగాక పరిష్కరించేవారు కూడా.

పోలూరిలోని దంపతులు కదలాడిలోని వైద్యశాలకు వెళ్ళి వస్తూ దోవలో ఎలత్తూరు చెరువులో మంచినీళ్ళు త్రాగి వస్తున్నారు. ఆమె తన పది సవర్ల బంగారు దండ పోయినట్లు గుర్తించి ఏడుస్తుంది.



ఆ మార్గాన పొయ్యే ఒక ముసలామె సలహా ప్రకారము వారు శ్రీ పూండి స్వామి వారిని దర్శించారు. వారు నోరు విప్పి తమ బంగారు దండ పోయిందని చెప్పకముందే శ్రీ స్వామివారు "మగ అలలు, ఆడ అలలు, హాస్పటల్, ఎలత్తూరు చెరువు, పో" అన్నారు. వారికామాటలు అర్థం కాలేదు. అక్కడున్న ఒక సాధువు వారి బాధ తెలుసుకొని మీరు ఎలత్తూరు చెరువు దగ్గర మీ దండ కోసం వెతకమని శ్రీ స్వామి వారు చెపుతున్నారని వివరించారు. వారదే విధంగా ఎలత్తూరు చెరువు దగ్గర చూస్తే వారి బంగారు దండ నీటి ఒడ్డున దొరికింది. అది మొదలు వారికి శ్రీ స్వామి వారే కులదైవమైనారు.

సర్వజ్ఞులు, సర్వవ్యాపకులు అయిన శ్రీ స్వామి వారికి ఈ సృష్టిలోని ప్రతి విషయము తెలిసి ఉండడమేగాక అందరి దు:ఖాలను అడగకముందే తీర్చడం వారి అనంత కరుణకు నిదర్శనం గదా!

ఇలాగే ఒకామె తన రెండు ముక్కు పుడకలూ తీసి తన పవిటచెంగున మూట కట్టి స్నానం చేసి వచ్చి శ్రీ స్వామి వారి దర్శనానికై క్యూలో నిలుచున్నది. అప్పుడు తన ముక్కు పుడకలు పవిట చెరుగులో లేనట్లు తెలుసుకొని బాధపడుతుంది. అప్పుడే ఒక బస్సు శ్రీ స్వామి వారి దగ్గర నిలచింది. "బస్సు కుడివైపు వెనుక చక్రంలో ఒక ముక్కుపుడక మరొకటి ప్రక్కనున్న గుంటలో ఉంది, చూడమన్నారు. ఆ ముక్కుపుడకలు అలాగే ఉన్నాయి. కానీ అవి అక్కడికెలా వచ్చాయో ఎవ్వరికీ అర్థం కాలేదు. సర్వ సమర్థులైన శ్రీ స్వామి వారే వాటిని అక్కడకు చేర్చారని తెలుస్తుంది.

పురంధరదాసుగారి భార్య దానం చేసిన ముక్కుపుడకను ఆమె త్రాగబోయే విషపు గిన్నెలో వేసిన భగవంతునకిలాంటి లీలలు ఒక లెక్కా.

బెంగుళూరులో పోగొట్టుకున్న మాటీలను తిరుపతికొచ్చి మాటీలు పోయాయని గుర్తించారు. పది రోజుల తర్వాత గూడూరులోని వారి ఇంట్లోని సూట్‌కేసులో ఒక ఆభరణాల పెట్టెలో ఆ మాటీలను సురక్షితంగా ఉంచిన భగవంతునకు అసాధ్యమేముంది.

ఒక సినిమా నటి తన మ్రొక్కుబడి తీర్చేందుకు ఒక వ్యాను నిండా 500 మందికి సరిపడే ఆహార పదార్థాలు తీసుకొని పూండి స్వామివారి సన్నిధి చేరింది. ఆ రోజు అక్కడ భక్తుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఆహార పదార్థాలన్నీ వృధా అవడమేనా? అని బాధపడింది. ఆ విషయం శ్రీ స్వామి వారు పద్యరూపంలో ఇలా అన్నారు.

పళని నుండి పప్పన్నం కొరకు,
తిరుత్తణి నుండి పెరుగన్నం కొరకు,
ఎరుపళి వారు నిమ్మకాయ పులిహోరా కొరకు

వస్తున్నారు అని అన్నారు

కొద్ది సేపటిలోనే శబరిమలై, పళని, మధురై వెళ్ళే బస్సుల నిండా యాత్రికులు దిగారు. శ్రీ స్వామి వారు యాత్రికులతో "ఆహారము మీ కొరకు ఎదురు చూస్తుంది. భోం చేయండి, అని అన్నారు. వాళ్ళందరికీ భోజనాలు వడ్డించమని ఆ సినిమా నటిని ప్రోత్సహించారు.



సర్వప్రేరణాధికారియైన శ్రీ స్వామి వారు యాత్రికులను తీసుకరావడం వారికి ఆహారం సమకూర్చడం అన్నీ చేసేది వారే గదా!

తాంబరం క్లబ్బులో నలుగురు పేకాట ఆడుతున్నారు. వారిలో ఒక బస్సు ఓనరు కూడా ఉన్నాడు. మిగిలిన వారు వ్యాపారస్తులు. వీరిలో ఒకడు శ్రీ స్వామి వారి భక్తుడు. అతడు స్వామీ! నాకు మంచి కార్డులు రావడం లేదు. మంచి కార్డులు వచ్చేటట్లు చేయండి అని ప్రార్థించాడు. అది విని బస్సు ఓనర్ "సోమరిపోతులంతా తమకు తాము భక్తులుగా ప్రకటించుకొని ప్రజలను మోసం చేసి తిని తిరిగేవాళ్ళు" అని అన్నాడు. దాన్పై వారు కొంత చర్చ జరిపారు. అప్పుడు బస్సు ఓనర్ "ఈ ఆటలన్నింటిలోను నేనే గెలిస్తే గెలిచిన డబ్బుతో మిమ్ములను ముగ్గురినీ శ్రీ స్వామి వారి దగ్గరకు తీసుకపోతానన్నాడు. అదేవిధంగా ఆటలన్నింటిలో అతడే గెలిచాడు. మాట ప్రకారం అతడు వారిని శ్రీ పూండి స్వామి వారి దగ్గరకు తీసుకవెళ్ళాడు. వాళ్ళను చూడగానే శ్రీ స్వామివారు - క్వీన్, కింగ్, క్లబ్, జోకర్ అన్నారు. ఆ మాటలు వింటూనే వారికి వణుకు పుట్టింది.

బస్సు ఓనర్ నమస్కరిస్తుంటే - వారు సోమరిపోతులు, ప్రపంచాన్ని మోసం చేసి బ్రతుకుతున్నారు అని అనగానే ఆ బస్సు ఓనరుకు ప్రాణం పోయినంతపనయింది. తనభక్తుడు నమస్కరిస్తుంటే "ఏమయ్యా నీకు మంచి కార్డులు రావాలని నన్ను పిలుస్తావా? నేను మంచిగానే ఉన్నాను. నన్ను మోసగానిగా అందరికీ పరిచయం చేస్తావా? మంచిని పొందేందుకు మంచిగా ఆలోచించండి, మంచి చేయండి" అని అందరికీ హితవు చెప్పారు. పేకాట వంటి వ్యసనాలలో ఉన్నా వారిని ఈ అనుభవంతో సంస్కరించి భక్తి, విశ్వాసాలు గల సత్‌పౌరులుగా మార్చారు. వారి లెక్కలో ఎంతో పుణ్యము లేనిదే

ఇలాంటి మహనీయుల దర్శనం చేసుకొని మంచి మార్గానికి రాలేరు. గనుక పుణ్యకార్యాలు చేయడం మన కర్తవ్యం కావాలి. ఏది పుణ్యం ఏది పాపం అనేది ప్రతి ఒక్కరికీ కలిగే సందేహమే.

**పరోపకారం పుణ్యం, పరపీడనం పాపం అన్నారు పెద్దలు.**

భగవంతుడు మనకిచ్చిన పని ధర్మబద్ధంగా చేయడం గొప్పపుణ్యం. స్కూలు టీచర్ జీతాలు తీసుకొని పాఠాలు సరిగా చెప్పడం లేదు. ఎంతమందికి అపకారం చేస్తున్నాడో యోచించండి. వ్యాపారులు, ఉద్యోగస్తులు, రాజకీయ నాయకులు అందరికీ పై విషయాలు వర్తిస్తాయి. ఎంతోమందికి ద్రోహం చేసి సంపాదించిన డబ్బుతో భగవంతుని కార్యాలు చేస్తే పాపం పోతుందనుకోవడం వట్టి భ్రమ. అందులోను పేరు ప్రతిష్టలు కోరి చేస్తే ఆ దాతకు ఏమీ అంటదు. ఇది ఆత్మజ్ఞానియైన జ్ఞానేశ్వర్ మహరాజ్‌గారి తీర్పు. శ్రీ సాయినాధుడు, శ్రీ వెంకయ్య స్వామి, శ్రీ తాజుద్దీన్ బాబా, శ్రీ పూండి స్వామి వారి చరిత్రలలో ఈ విషయం మనకు బాగా తెలుస్తుంది. దైవీ సంపద లక్షణాలలో దేవ, ద్విజ, గురు, ప్రాజ్ఞపూజనం అని మొదటి లక్షణం చెప్పారు. పూజ యాంత్రికము, లాంచన ప్రాయము కాకుండా చేయమంటారు. అలా చేస్తే పుణ్యం వస్తుంది అంటారు. ధర్మంగా ఆర్జించిన ధనంతో పరోపకారం చేస్తే గొప్ప పుణ్యం వస్తుంది. వీటిలో ఒక్కొక్క విషయాన్ని చర్చించాలంటే చాలా వ్రాయాలి. అవసరమైన వారు పెద్దలను సంప్రదించవలసినది.

ఆవలూరుపేట నుండి వచ్చిన ముగ్గురు శ్రీ స్వామివారిని దర్శించి గంజాయితో నింపిన మూడు సిగరెట్లను శ్రీ స్వామివారికిస్తే వారు ఒకేసారి వాటిని కాల్చి త్రాగేశారు. కానీ వారికేమీ మైకం రాలేదు.



సిగరెట్లిచ్చిన వారు పూండి నది దగ్గరకు వెళ్ళి శ్రీ స్వామి వారిని గూర్చి మాట్లాడుకొని - గంజాయితో నింపిన మరొక సిగరెట్టు శ్రీ స్వామి వారికిచ్చి చూడాలని మరలా శ్రీ స్వామి వద్దకు వచ్చారు. వారు రాగానే "మూడు గంజాయి సిగరెట్లు త్రాగినా ఈయనకేమీ కాలేదు, కానీ ఈయన ఒక సామాన్యసాధువే" అని అంటూ వారికి విభూతినిచ్చారు. ఆ మాటలు వినగానే వారు ఆశ్చర్యచకితులై తాము నది ఒడ్డున మాట్లాడుకున్న మాటలు యధాతథంగా చెప్పిన ఈయన సామాన్య సాధువు కాదు. చాలా గొప్ప మహాత్ముడు అనే భక్తి భావంతో వారికి పాదాభివందనం చేసి వెళ్ళారు.

పొన్నుస్వామి నాయనార్ పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు. కొందరు దొంగలు వారి చక్కెర ఫ్యాక్టరీ మిషన్లు దొంగిలించి తీసుకవెళ్ళారు. ఆయన పోలీసు రిపోర్టు కూడా ఇచ్చాడు. కానీ దొరకలేదు. పొన్నుస్వామి శ్రీ పూండి స్వామి వారి దగ్గర మొర పెట్టుకున్నారు. అప్పుడు శ్రీ స్వామి వారు నీ సొమ్మెక్కడికీ పోలేదు. నది ఒడ్డున గల నసన్ తోపు వద్ద వెదుకు అన్నారు. ఆయన అక్కడ వెతికినప్పుడు ఒకచోట కొన్ని ఇనుప బోల్టులు దొరికాయి. అక్కడుండే ఇసుక తొలగించి చూస్తే ఆ మిషన్లన్నీ అక్కడే ఇసుకలో పూడ్చిపెట్టియున్నారు.

ఈ సృష్టిలోని ప్రతి చిన్న సంఘటనకూడా మహనీయులకు తెలుస్తూనే ఉంటుంది. అయితే వారిని విశ్వాసముతో ఆశ్రయించిన వారికే మేలు జరుగుతుంది. విశ్వాసము లేకుండా వారు చెప్పినట్లు చేయలేని వారేమీ పొందలేరు.

## ఆకాశ గమనాయ నమ:

ఆకాశ గమనాయ నమ: అంటే కోరినచోట సంకల్పమాత్రాన కన్పించగల వానికి నమస్కారమని అర్ధము. శ్రీ పూండి స్వామి వారికి ఒకే సమయంలో అనేక చోట్ల దర్శనమివ్వడం ఒక వినోదలీలగా ఉండేది. ఒక్కొక్కసారి తానా స్థలాలలో ఉండినది వాస్తవమేనని భక్తులకు ఎరుక పరచే వారు కూడా. ఒక్కొక్కసారి ఒకే సమయంలో అనేక చోట్ల కనిపించి తానెవ్వరైంది వారికి తెలియకపోయినా వారిని ఆపదల నుండి రక్షించేవారు. అనంతమైన వారి దివ్యలీలలలో మనకు లభించినవి చాలా స్వల్పమే. మానవ శరీరం రావడం ఎంత గొప్ప అదృష్టమో, దానిని పెద్దలు చెప్పినట్లు ఆశను వదలి సద్వినియోగం చేసుకుంటే ఎంతటి దివ్యస్థితి పొందవచ్చో తెల్పేదే ఈ ఆకాశ గమనాయ నమ: అనే లీలా ధ్యేయం.

మే నెల ఎర్రటి ఎండలో తారు రోడ్డుమీద విరామం లేకుండా పచార్లు చేస్తున్న స్వామి వారిని ఎందుకిలా చేస్తున్నారని అడిగిన వారితో - నిమ్మకాయ పులిహోర వంటికి మంచిది. నిమ్మకాయ ఊరగాయ వంటికి మంచిది. ఒకే సంతగుంపులు అని మాత్రం అన్నారు. అదే సమయంలో తిరుపుత్తూరు భక్తులు శ్రీ వారి దర్శనానికి రావాలని పులిహోర చేసేందుకు నిమ్మకాయల కొరకు సంతకు వెళితే అక్కడెక్కడాలేవు. వారు సంత బయటకు రాగానే వారు కోరిన ధరకే ఒక వ్యక్తి నిమ్మకాయలిచ్చారు. తిరుపుత్తూరు భక్తులిప్పుడు కలశపాకం వచ్చి తమకు నిమ్మకాయలిచ్చిన వారు శ్రీ స్వామి వారేనని గుర్తించి ఆశ్చర్యపోయారు. కానీ అక్కడున్న ప్రజలు గత ఐదురోజులుగా శ్రీ స్వామి వారు ఎక్కడికీ వెళ్ళలేదంటారు. ఆకాశగమనాయ నమ: అంటే సంకల్పమాత్రం చేత కోరిన చోట కన్పించగలవారు అని అర్ధం.



మీ దర్శనానికి వస్తున్నాము. నిమ్మకాయలు దొరకలేదు స్వామీ అని చెప్పుకొనిన వెంటనే శ్రీ స్వామివారు వారికి నిమ్మకాయలిచ్చారు. కానీ అదే సమయంలో కలశపాకంలోనే ఉన్నారు. అది మొదలుకొని ఆ తిరుపుత్తూరు భక్తులు తరుచుగా శ్రీ స్వామి వారిని దర్శించేవారు.

శ్రీ స్వామివారు మూడు రోజులుగా కదలకుండా సంతలో కూర్చొనియున్నారు. ఒకామె శ్రీ వారికి కొంత గంజి సమర్పించింది. అప్పుడామెతో వేలూరు నుంచి మూడు రకాల ఆహారపదార్ధాలు తెచ్చేవారు వస్తూ పోలూరులో దారి తెలియక ఉన్నారు. వారికి నేను వెళ్ళి దారి చెప్పి వస్తానన్నారు.

ఒక గంట తర్వాత వేలూరు నుంచి వచ్చిన భక్తులు మూడు రకాల ఆహార పదార్ధాలు తెచ్చి శ్రీ స్వామి వారికి నివేదిస్తూ - వీరే గదా మనకు ఒక గంట క్రిందట పోలూరులో దారి చెప్పినవారు అని ఆశ్చర్యపోయారు. కానీ సంతలో గంజి ఇచ్చిన తల్లి శ్రీ స్వామి వారు తాను గంజి ఇచ్చేటప్పుడన్న మాటలు చెప్పి మూడు రోజులనుండి ఈ క్షణం వరకూ శ్రీ స్వామివారు ఇక్కడనుండి కదలనే లేదు మరి వీరు మీకు పోలూరిలో దారి ఎలా చెప్పారు అంటుంది. ఆకాశ గమనాయనుడు గదా! సంకల్పమాత్రం చేత కోరిన చోట కన్పించగల సిద్ధ పురుషుడని వారు ఒకే కాలంలో ఎన్నిచోట్లయినా కన్పించగలరని ఆమెకు తెలియదు గదా పాపం.

సింగారవాడి అనే గ్రామంలో ఒక బ్రిడ్జిమీద శ్రీ స్వామి వారు కూర్చొనియున్నారు. ఒక భక్తుడు వచ్చి స్వామీ ఈ రోజు ఆషాఢ కృత్తిక గనుక మిమ్ములను సైకిల్ మీద విల్వారాణిలోని సుబ్రమణ్యం స్వామి గుడికి తీసుకపోతానన్నాడు. మీరు వెళ్ళి రండి నేను వస్తాను.

ఒకే సంతసమూహము అని శ్రీ స్వామి వారన్నారు. ఆ సైకిల్ భక్తుడు విల్వరాణి చేరగానే అక్కడ ఒక బండపైన మౌనంగా కూర్చున్న స్వామి వారిని చూచి ఆశ్చర్యపోయాడు. సైకిల్ పైన వచ్చే నాకంటే ముందు ఏ వాహనం గూడ రాలేదు. మరి శ్రీ స్వామివారు నా కంటే ముందెలా ఇక్కడకు వచ్చారని అక్కడున్నవారికి చెప్పాడు. నాలుగు రోజుల నుండి శ్రీ స్వామి వారు ఇక్కడే ఉన్నారు. మరి మీకు గంట క్రిందట సింగారవాడిలో ఎలా కనిపించారని వారి యోగశక్తికి ఆశ్చర్యపోయారు.

ఒకమారు చైయార్ నదిలో శ్రీ వారు తపస్సులో కూర్చొని యుండగా హటత్తుగా వెల్లువ వచ్చి రెండుపాయలుగా చలి నీరు ప్రవహించిందే కానీ శ్రీ స్వామివారిని తాకలేదు.

కలశపాకం, పూండి మధ్యలో ఒక రోడ్డు ప్రక్కన శ్రీ స్వామి వారు పడుకొన్నారు. వారి ప్రక్కన ఒక సాధువు కూడా పడుకున్నాడు. అర్ధరాత్రి చూచేసరికి శ్రీ స్వామివారు ఆ సాధువుకు కనిపించలేదు. స్వామివారి కొరకు నలువైపుల చూస్తుంటే శ్రీ స్వామి వారు ఒకచోట కంకర రాళ్ళు తింటున్నారు. శ్రీ స్వామివారు విశ్వరూపులుగా కనిపించడంతో ఆ సాధువు పూండికి పరిగెత్తాడు. తెల్లవారి ఆ సాధువు శ్రీ స్వామివారిని దర్శించి నమస్కరించి స్వామి నిన్న రాత్రి ..." అని అనగానే - అవునప్పా నిన్న అలా జరిగిపోయింది. అకాలములో రావద్దు మంచిది వెళ్ళిరండి అని ఆశీర్వదించారు.

విల్వరాణి నుండి బస్‌కండెక్టరు, డ్రైవరు లాస్టు బస్సులో స్వామిని చెంగం తీసుకవెళ్ళారు. తెల్లవారి శ్రీ స్వామి వారికి టిఫిన్, కాఫీ ఇప్పించి మీరిక్కడే ఉండని చెప్పి, బస్సులో వస్తున్నారు. శ్రీ స్వామి వారు అక్కడే ఉన్నారు. మధ్య మార్గంలో నది ఒడ్డున శ్రీ స్వామి వారిని చూచి



బస్సు ఆపారు. ఈ బస్సుకంటే ముందు ఏ బస్సు లేదు. శ్రీ స్వామి వారిక్కడికెలా వచ్చారని అందరూ ఆశ్చర్యముతో నమస్కరించారు. శ్రీ స్వామివారు ఒకే చోట ఉండి అదే సమయంలో అనేకచోట్ల దర్శనమివ్వడం అనేది వారికొక వినోదలీల మాత్రమే.

చెంగం తాలూకా కృష్ణాపురం నుండి ఇద్దరు స్నేహితులు వచ్చి స్వామిని దర్శించుకొని వారికి ఇడ్లీ, వడ తినిపించి బస్సులో తమగ్రామం వెళుతున్నారు. కడలాడి అనే గ్రామం వచ్చేసరికి శ్రీ స్వామివారు అక్కడున్నారు. నక్షత్రగుడిలో గంటకు క్రిందట శ్రీ స్వామి వారికి ఇడ్లీ, వడ సమర్పించి వస్తున్నాము. ఈ బస్సుకంటే ముందు బస్సులేదు. శ్రీ స్వామి వారిక్కడికెట్లా వచ్చారని అక్కడున్నవారినడిగితే - మూడు రోజులనుండి స్వామి ఇక్కడే ఉన్నారు. నక్షత్ర గుడిలో మీరెట్లా చూచారు అంటున్నారు. శ్రీ స్వామివారికి గుగ్గిళ్ళు పెట్టబోతే "ఇప్పుడే గదప్పా మీరు ఇడ్లీ, వడ ఇచ్చారు. మరలా గుగ్గిళ్ళెందుకు అన్నారు. అంతేగానీ ఇతర ఏ ప్రశ్నలకు సమాధానమివ్వలేదు. శ్రీ స్వామివారు గొప్ప సిద్ధపురుషులని అందరూ నమస్కరించారు.

చాలామంది యోగులు శ్రీ స్వామివారిని దర్శించేవారు. ఒకపుడొక యోగి యొక్క జుట్టు ముడివిప్పితే ఆ జుట్టు వీదులు చిమ్ముతున్నంత పొడవుగా ఉంది. అతని కండ్లు రక్త వర్ణంలో ఉన్నాయి. అతడు మాటి మాటికి ఒక నాగుబామును తన పెద్ద జేబునుండి తీసి తన చేతికి వేసుకొని కొంతసేపు అయ్యాక మరలా జేబులో వేసుకునేవాడు. ఇట్లా పలుమార్లు చేసి శ్రీ స్వామి వారి ఎదుటనే బీడీ త్రాగాడు.

ఇదంతా మౌనంగా చూస్తున్న శ్రీ స్వామి వారు "అతను కూడా మనిషే. అతనికి పిల్లాపాపలున్నారు. బిడ్డలు బాధపడుతారు. అతనిని వదిలెయ్ ఎవరో చేసిన పాపానికి ఇతనిని ఎందుకు బాధపెడుతావు. మంచి ఆలోచించు. మంచిచెయ్యి, మంచి జరుగుతుంది. మన అంతస్తుకు ఇలాంటి మహిమలు పనికిరావు" అని అన్నారు. ఆ యోగి నవ్వి "మీ ఆజ్ఞ ప్రకారమే చేస్తాను" అంటూ కొన్ని అడుగుల దూరం వెళ్ళిగాలిలో అదృశ్యమైపోయారు. అక్కడున్న ప్రజలు ఇదేంటి స్వామీ? అంటే "అది దైవరహస్యం" అని అన్నారు.

మహనీయులతో మనకు గల గత జన్మ ఋణానుబంధము వలన మనలను వారు తమ సన్నిధికి చేర్చుకుంటారు. మనం వారి సన్నిధిని సద్వినియోగం చేసుకుంటే ఎంతో ఉద్ధరించబడుతాము. అహంకరించి మన పాత సంస్కారాలనే అంటిపెట్టుకుంటే చేజిక్కిన వజ్రాన్ని జారవిడుచుకొన్న అభాగ్యులమౌతాము.

బదరీనాథ్ నుండి ఒక యువసన్యాసి కార్తీక దీపోత్సవానికి తిరుమణ్ణామలై వచ్చాడు. అతను కొండెక్కుతుంటే కొండకు ఉత్తరం వైపు గొప్ప వెలుగు కనిపించింది. తనకు తెలియకనే అతడు ఆ వెలుగు వైపుకు నడవసాగాడు. చివరకతడు శ్రీ పూండి స్వామి వారి సన్నిధికి వచ్చాడు. ఆ తర్వాత అతడు మూడుమార్లు తిరువణ్ణామలై వచ్చినప్పుడు కూడా ఇదే విధంగా శ్రీ స్వామివారు తన సన్నిధికి తీసుకవచ్చారు. ఆ సన్యాసి శ్రీ స్వామి వారిని సేవించి ఉద్ధరించబడ్డాడో, లేదో తెలియదు. శ్రీ పూండి స్వామి వారిలాంటి మహనీయుని సన్నిధిలో ఉంటే ఈ ఒక్క జన్మలోనే ఆత్మజ్ఞానం పొందడం సత్యం.



ఒక భక్తుడు తను కోరిన పనైతే శ్రీ స్వామి వారికి ఉంగరం సమర్పిస్తానని మొక్కుకున్నాడు. అతను కోరిన పని జరిగినందున అతనొక ఉంగరం తెచ్చి శ్రీ స్వామి వారి వేలికి తొడగబోయాడు. కానీ ఆ ఉంగరం చిన్నదైనందున వేలికి ఎక్కలేదు. అతడు బలవంతంగా ఎక్కించాడు. అందువల్ల వేలు బాగా వాచిపోయింది. కానీ శ్రీ స్వామి వారా బాధను గురించి పట్టించుకోలేదు.

ఒకరోజు తిరువాలం నుండి వచ్చిన శ్రీ శివానందస్వామిగారు కొన్ని మందు ఆకులు తెచ్చి నూరి ఆ వేలుకు పూయబోయాడు.

**శ్రీ స్వామి:** వేలికి ఉంగరము కావాలి కాబట్టి దానిని అలానే బాధపడనివ్వు. దానిని అలా వదిలేసెయ్.
**శ్రీ శివానందస్వామి:** మీ ఇష్టా ఇష్టాలు సంపూర్ణంగా కడిగి వేయబడ్డాయి. మీరొక పెద్ద బండరాయి వలె ఉన్నారు. మీకింకేమి మిగిలిఉన్నాయి.
**శ్రీ స్వామి:** అట్లాగయితే నీ యిష్టమొచ్చినట్లు చేసుకో. దీనిని చూసేందుకు కొన్ని రోజుల తర్వాత ఒకరు వస్తారు. అతని ఇష్టమొచ్చినట్లు చేసుకోనివ్వు, అన్నారు.

కొన్నాళ్ళ తరువాత ఒక చిలుక వచ్చి నిత్యం ఆ వేలిని తన ముక్కుతో పొడిచేది. శ్రీ స్వామి వారి భుజం మీద కూర్చునేది. ఆ చిలుక భుజం మీద ఉండగా తీసిన ఫోటో కూడా ఉంది. క్రమంగా శ్రీ స్వామి వారి వేలు వాపు తగ్గిపోయింది. ఆ ఉంగరాన్ని తొలగించివేశారు. ఆ చిలుక రూపంలో ఏ మహాత్ముడొచ్చారో ఎవరికి తెలుస్తుంది.

కోలారు గోల్డ్ ఫీల్డులో పని చేసే ఒక ధనవంతుడు వచ్చి నా జబ్బు నయం చేస్తే శ్రీ స్వామి వారికి కోరినంత ధనం ఇస్తానని అక్కడున్న ఒక సేవకునికి చెప్పాడు. ఆ మాట శ్రీ స్వామి వారికి చెపితే వారు విపరీతమైన విధంగా వ్యవహరిస్తారు. మీరు మీ బాధను శ్రీ స్వామి వారికి హృదయ పూర్వకంగా విన్నవించండి. డబ్బు మాట ఎత్తవద్దు అని సలహా ఇచ్చాడు.

అతడు నదిలో స్నానము చేసి వచ్చి శ్రీ స్వామి వారి ముందు నిలుచున్నాడు. అతడు నోరు విప్పి మాట్లాడకముందే శ్రీ స్వామి వారన్నారు. "నీవొక మూర్ఖుడివి. తల్లికి భార్యకు తేడా ఎవరికి తెలియదు, జంతువులు కూడా సంతానోత్పత్తికి సమయపాలన పాటిస్తాయి. నీవా చిన్న పిల్లతో ఆడుకున్నావు. నీవు చేసిన తప్పుకు కర్మ ఫలమనుభవించు" అన్నారు.

తన తప్పును యధాతదంగా చెప్పిన వీరు చాలా గొప్పమహాత్ములు. వీరు తప్ప వేరెవ్వరూ నా జబ్బు నయం చేయలేరు అని తలచాడు. అతడు నాలుగు రోజులు అక్కడే మొండికేసుకొని ఉండి వారిని ప్రార్ధిస్తూనే ఉన్నాడు. అప్పుడు శ్రీ స్వామి వారు - ఓరి నీచుడా ఆవేశ్యతో నేకేమి పని ? సెరుప్పడితో నీ జబ్బు పోతుంది అని అన్నారు. సెరుప్పడి అనే పదానికి అర్ధం చెప్పు దెబ్బ. మరొక అర్ధం అదొక ఆయుర్వేదమందు. మందు అనే అర్ధం తెలియక అతడు బాధ పడుతున్నాడు. అక్కడున్న ఒక సాధువు - సెరుప్పడి అంటే ఆయుర్వేదమందు. దానిని నీవు కషాయంగాకాచి త్రాగు నీ జబ్బు పోతుందని చెప్పాడు. ఆరు నెలల తర్వాత ఆరోగ్యవంతుడై ఆతడు కృతజ్ఞతతో వచ్చి శ్రీ వారికి నమస్కరించాడు. కోపము నీటి మీద వ్రాసిన అక్షరంలాంటిది. మరొకటి ఇసుకలో వ్రాసిన అక్షరం లాంటిది



మరొకటి రాతిపై చెక్కిన అక్షరంలాంటిది. మహనీయుల కోపం నీటి మీద వ్రాసిన అక్షరంలాంటిది. సాత్వికుల కోపం ఇసుకమీద వ్రాసిన అక్షరంలాంటిది. మూర్ఖులకోపం రాతిమీద చెక్కిన అక్షరం లాంటిది. శ్రీ స్వామివారు మొదట అతనిని తిట్టినా ఆకోపం క్షణం సేపే. చివరకు అతని వ్యాధి పోగొట్టారు గదా! కోప్పడ్డ వారినల్లా మూర్ఖులని తలవడం అజ్ఞానమవుతుంది.

ధర్మపురి జిల్లా ఊత్సంగరై నుండి ఒక వ్యక్తి శ్రీ స్వామి వారి ఎదుట నమస్కరిస్తున్నాడు. వెంటనే శ్రీ స్వామివారు మునుస్వామి ముందున్న నాగలి బాగాలేదు. వెనుకనున్న నాగలి బాగాలేదు. ఇక వ్యవసాయమెలా సాగుతుంది. అంతా కుక్కల పాలౌతుంది. జాగ్రత్త.

మరి మార్గమేమిటి స్వామి? అన్నాడతడు నారుమడిలోనుండి నారు తీసి మాగాణిలో విడి విడిగా నాటాలి. అప్పుడు వరి బాగా పెరుగుతుంది. అక్కడే వదిలేస్తే నాశనమౌతుంది అన్నారు శ్రీ స్వామి వారు.

చెడు అలవాట్లకులోనైన తన అన్న తమ్ములను గూర్చి చెప్పిన మాటలని ఆ వచ్చిన వ్యక్తికి అర్ధమయింది. అతడు ఇంటికి వెళ్ళి తన భాగం ఆస్థిని తీసుకొని వేరుబోయాడు. అతని అన్న దమ్ముళ్ళు ఆస్థంతా పోగొట్టుకొని బీదరికముతో బాధపడుతున్నారు. శ్రీ వారి సలహా ప్రకారం వేరుబోయినందున సుఖంగా ఉన్నాను. ఇప్పుడు శ్రీ స్వామి వారే నాకు దైవము అంటున్నాడు.

శ్రీ స్వామి వారి మాటలు ఆ వ్యక్తికి అర్ధమయ్యేటట్లు చేశారు శ్రీ స్వామి వారు. మన దగ్గర కొంతైన పుణ్యాము, ధర్మము ఉంటే

మహనీయుల కృపను పొందే విధంగా నడుచుకోగలుగుతాము. పుణ్యము సూన్యమైనప్పుడు మహనీయులెంత కృపచూపినా అది బూడిదలోబోసిన పన్నీరౌతుంది.

సంకల్ప మాత్రాన పంచభూతాలను అదుపు చేయగల సామర్థ్యం సిద్ధపురుషుల కుంటుంది. కాని మనం వారికి మన బాధ చెప్పుకోవాలి. లేకుంటే సృష్టి సూత్రాలకు వ్యతిరేకంగా వారు పంచభూతాలను ఆజ్ఞాపించరు. సాటిజీవుల బాధ చూచినప్పుడైనా వారు ఆ జీవులపై కరుణతో పంచభూతాలను ఆజ్ఞాపిస్తారు. ఒకసారి వర్షాలు లేక కరువుగా ఉండి పశువులకు గడ్డిలేదు. అవి పులివిస్తరాకులు, చింపిరి కాగితాలు తినడం శ్రీ వెంకయ్యస్వామి వారు చూచి ఒక గంటలోపల వర్షం కురిసి చెరువులు నిండేటట్లు చేశారు. కరుణకు మారుపేరు మహనీయులే అని నిరూపించారు.

1968 వ సం||లో ఉత్తర ఆర్కాడ్ జిల్లాలో వర్షాలు లేక కరువుతో ఉంది. అక్కడ నుంచి వచ్చిన భక్తులు శ్రీ స్వామి వారికి తమ కరువు విషయం చెప్పుకొని వర్షం కొరకు వారిని వేడారు. అందుకు శ్రీ స్వామివారు "నేను మనిషిని పంపాను. టెంకాయ చిప్పలో నీరు తెస్తున్నాడు" అని శెలవిచ్చారు. ఆ రాత్రికి రాత్రి వర్షం కురిసి చెరువులన్నీ నిండాయి. ప్రకృతిమాత పులకించి ఆకుపచ్చని చీరతో నాట్యమాడింది. అనంత కోటి జీవులు భగవంతునకు కృతజ్ఞతలు తెలిపాయి. కానీ శ్రీ స్వామి వారు వారి స్తోత్రాలు, కృతజ్ఞతాభివందనలు వింటారా!

సుబ్రమణ్యాం గారి భార్య కాన్పుకొరకు చిత్తూరు C.M. హాస్పటల్‌కువోతూ "స్వామీ నేను కాన్పు కొరకు C.M. హాస్పటిల్‌కు



పోతున్నాను. మీరు నాతో ఉండి రక్షించండి" అని ప్రార్థించింది. శ్రీ స్వామి వారామెకు విభూతినిచ్చి "నేను వస్తాను వెళ్ళి రండి - శుభం" అని దీవించి పంపారు.

C.M. హాస్పటిల్‌లో ఆమె ప్రసవం కాక శ్రీ స్వామి వారిని ప్రార్థించింది. అదే సమయంలో మరొక భక్తురాలు తన కష్టాలు చెప్పుకొని రక్షించమని వేడుకుంటూ విభూతి కొరకు అర్ధించింది. శ్రీ స్వామి వారు పలకక పోయినందున ఆమె పలుమార్లు అడుగుతూనే ఉంది. అప్పుడు శ్రీ స్వామి వారన్నారు "C.M. హాస్పటల్‌లో ఉండే ఆమెను రక్షించేదా? బోల్తా పడే లారీలో నున్న డ్రైవరును కాపాడేదా? పందిరి వేస్తుంటే జారి క్రింద పడే మనిషిని రక్షించేదా? మధ్యలో నీ కష్టాలు తీర్చేదా? అని అన్నారు.

మూడు రోజుల తర్వాత ఆ ముగ్గురూ శ్రీ స్వామి వారి దర్శనానికి వచ్చి సాష్టాంగ పడ్డారు. శ్రీ స్వామి వారు అలా అన్నారే కానీ వాళ్ళందరినీ ఒకే కాలములో రక్షించి కాపాడిన మహనీయుడు. పిపీలకాది బ్రహ్మ పర్యంతం సర్వమూ తానైన ఆ మహనీయునకు ఎదురేముంది! ఒకే కాలంలో ఎన్ని దివ్యలీలలైనా చేయగలరు గదా!.

అదే వీధిలో నున్న ఒక భక్తురాలు శ్రీ స్వామివారికి చెప్పకుండా ఏమీ చేసేది కాదు. ఒక రోజు ఉదయం పొలం పనికి పోతూ "స్వామీ నేను పొలం పనికి పోతున్నాను. నా ఇల్లు కనిపెట్టి చూస్తుండండి" అని ప్రార్థించి వెళ్ళిపోయింది. ఆమె సాయంకాలం వచ్చేసరికి ఇంట్లో పెట్టె తాళం తీసి అందులోని మూడు వందలరూపాయలు ఎవరో దొంగిలించారు. ఆమె శ్రీ స్వామి వారి వద్దకొచ్చి తన బాధ చెప్పుకొని ఏడ్చింది. అప్పుడు స్వామి "ఎవరికి అవసరమైతే వాళ్ళు తీసుకున్నారు.

మన ముక్కు, మన కళ్ళే. నన్నేమి చేయమంటావు. ఆ డబ్బు తీసుకున్నవాడు ఇప్పుడే విభూతి తీసుకొని వెళ్ళాడు" అని చెప్పారు. నీ కొడుకే డబ్బు తీసుకపోయాడు అని చెప్పకుండా మన ముక్కే, మన కళ్ళే అనే మాట ద్వారా ఎరుకపరచారు.

కలశపాక వాస్తవ్యులు మాణిక్యనయనార్ తంగవేలు నయనార్ అనే సోదరులు శ్రీ స్వామి వారి ఎడల భక్తిగలవారు. ఒక రోజు రాత్రి మాణిక్య నయనార్ పొలములోనున్న తన సోదరుడు తంగవేలుకు అన్నం తీసుకపోతూ మాణిక్యావాచకర్ గారు రచించిన పాటలు పాడుకుంటూ పోతున్నాడు. సమీప పొదలలోనున్న శ్రీ స్వామి వారు ఆ పాటలు విని నా హృదయము ఆనందముతో నిండినదని అరిచారు. రాత్రి వేళ ఆ పొదలలో శ్రీ స్వామి వారిని చూచి మాణిక్యం భయపడ్డాడు. శ్రీ స్వామి వారతనిని భయపడకుండా వెళ్ళమన్నారు. కానీ మాణిక్యంగారు తన దగ్గరున్న అన్నం శ్రీ స్వామి వారికి తినిపించారు. అది మొదలు ఆ సోదరులెవరో ఒకరు నిత్యం శ్రీ స్వామి వారిని వెతికి ఆహారమిచ్చేవారు.

తంగవేలు గారు వేరుశెనగ కాయల వ్యాపారము చేసేవారు. ఒకరోజు శ్రీ స్వామివారు నీవు చేసే వేరుశెనగకాయల వ్యాపారం ఒక సంవత్సరం పాటు చేయవద్దాన్నారు. మీ అన్నను వేరుశెనగ కాయల వ్యాపారం ఒక సంవత్సరంపాటు మానమని చెప్పమన్నారు. మాణిక్యం చెప్పినా తంగవేలు ఆ వ్యాపారం మానలేదు.

అతడు వందల సంఖ్యలో వేరుశెనగకాయల బస్తాలు కొని నది ఒడ్డున ఆరబోశాడు. నదిలో ఒక్కసారి వెల్లువ వచ్చి కాయలన్నీ కొట్టుకపోయాయి. తన ఆస్థంతా అమ్మి బాకీలు తీర్చవలసి వచ్చింది.



సద్గురువు దయచూపినా వారి ఆదేశాన్ని పాటించకుంటే మనమేమీ పొందలేము. సద్గురువు మాట పాటించి, ఆచరించి గొప్ప మేలు పొందినవారి విషయాలెన్నో శ్రీ గురుచరిత్ర, సాయి చరిత్రలలో చూస్తాము. వారి మాట ఆచరించనివారు కాలాంతరంలో బాధలుపడడం చూస్తాము.

కలశపాకం వాస్తవ్యులు గోపాలనాయనార్, కైలాసనాయుడు శ్రీ స్వామి వారిని వెతికి అన్నం పెట్టేవారు. ఒకరోజు వీరు కలశపాకం నదిలోనూ మేటు పాలయం, కుజ్జాడియేడు, కలశపాకం సంత ఎక్కడ వెతికినా శ్రీ స్వామివారి జాడేలేదు. వారు తిరిగి తిరిగి అలసిపోయి మేటుపాలయం కాలువలోని నాగజెముడు పొదల దగ్గర విశ్రాంతి కొరకు కూర్చున్నారు. ఇంతలో ఒక పెద్దపాము నాగజెముడు పొదలలోనికి పోవడం చూచి భయపడ్డారు. పొదలలో బుస్సు బుస్సు మనే శబ్దం వస్తుంది. అటుచూస్తే శ్రీ స్వామి వారు అక్కడ కూర్చొని ఉన్నారు. వారి దగ్గరకు వెళ్ళేదారిలేక పశువులకాపరుల చేత నాగజెముడు నరికించి దోవచేసి వారికి అహారము పెట్టారు. అక్కడ నాగజెముడు పండ్లతొక్కలు పడి ఉన్నాయి. స్వామీ మీకు కావలసిన ఆహారం మేమిస్తాము. మీరీ నాగజెముడు పండ్లు తినకండి అని వేడుకున్నారు. అందుకు స్వామివారు "అది దేవ ఆహారము. మీరు వెళ్ళండి" అని చెప్పారు. స్వామీ ఇక్కడ పాములున్నాయి. మీరిక్కడకు రావద్దు అంటే "అవి చాలా మంచివి, మీరు భయపడకుండా వెళ్ళండి" అని చెప్పారు.

## సినిమా ద్వారా ఆత్మబోధ:

ఒక భక్తుడు శ్రీస్వామి వారిని దర్శించుకొని టూరింగ్ సినిమా థియేటర్‌లోని సినిమా చూచుటకు తీసుకవెళ్ళాడు. అందరికీ సినిమా కనబడుతుంది. ఈ భక్తునకు మాత్రం తెల్లని తెర మాత్రమే కనబడుతుంది. స్వామీ నాకు సినిమా తెరతప్పితే సినిమా కనిపించడంలేదు మీకేమైనా సినిమా కనిపిస్తుందా అని అడిగాడు. దానికి శ్రీ స్వామివారు విజ్ఞానము, మిజ్ఞానము (ఆత్మజ్ఞానము) పోటీ చేస్తే నేనేమి చేయగలను అని చెప్పి హాలు బయటికి వచ్చేశారు. స్వామీ నాకెందుకు సినిమా కనిపించలేదు అని అడిగాడు. అందుకు స్వామి అన్నారు - మనస్సు ఖాళీ చేసుకో అంతా మంచి జరుగుతుంది. వచ్చినపని మానివేసి వద్దన్నదాన్ని ఎందుకు చేస్తావు అని శ్రీ స్వామి వెళ్ళిపోయారు.

సినిమా తెరలాంటిది ఆత్మ. అది ఏ క్రియ చేయకుండా ఆనందంలో మునిగి ఉంటుంది. మన మనస్సు అనే ప్రొజెక్టరులో ఆలోచనలు అనే సినిమా వేస్తే అది తెరమీద నవరసాలను చూపిస్తుంది. నిజానికి అంతా చేసేది మనస్సే కానీ తెరచేసినట్లనిపిస్తుంది. నిజంగా తెర ఏమీ చేయదు గదా! మనస్సును నియంత్రించి ఆత్మను తెలుసుకునే మార్గం చూడు. అని శ్రీ స్వామి వారు చెపుతున్నారు. వచ్చినపని మానేసి వద్దన్న పనినెందుకు చేస్తావు అంటే మానవ జన్మకు వచ్చింది ఆత్మను తెలిసికొనేందుకు మాత్రమే. ఆ పని మానేసి సినిమా చూడడం వంటి ఇంద్రియ సుఖాలలోపడి ఉండడం మంచిదికాదని బోధిస్తున్నారు.



ఒక వడ్రంగి ప్రతిరోజు కల్లు త్రాగేందుకు నది దాటి పళంకోయిల్ అనే గ్రామానికి వెళ్ళేవాడు. నదిలో కూర్చొనియున్న శ్రీ స్వామి వారికి నమస్కరించి వెళ్ళేవాడు. ఒక రోజు రాత్రి వేళ శ్రీ స్వామి వారిని దర్శించినపుడు ఒక అద్భుత దృశ్యం చూశాడు. ఐదుగురు పదహారు సం|| వయస్సుగల కన్నెలు తెల్లని మిరుమిట్లు గొలిపే వస్త్రములు ధరించి కొందరు చామరములు వీస్తుంటే మరికొందరు గంధం పూస్తుంటే మరొకరు పుష్పమాలలు శ్రీ స్వామివారి కంఠానికి అలంకరిస్తున్నారు. గాలిలేక ప్రజలు ఇబ్బంది పడే వేసవి రాత్రిలో చల్లని ఐస్‌లాంటి సుగంధ భరితమైన గాలి ఎలా వస్తుంది. ఐదు నిమిషాలు ఈ దృశ్యాన్ని చూచి భయపడి పరిగెత్తాడు. మరురోజు నదిలో మౌనంగా కూర్చొనియున్న శ్రీ స్వామి వారిని దర్శించి నిన్న తాను చూచిన అద్భుత దృశ్యం గురించి అడిగాడు. అది దేవ రహస్యము అని చెప్పి శ్రీ స్వామి వారు ఒక పాట పాడారు

అజ్ఞానం తొలగి పోయింది
ఆనందం పొందాము
ఆత్మజ్ఞానం వచ్చింది
కష్టాలు లేవు - అహంకారం తొలగింది

కర్మ బందం విడిపోయింది. జ్యోతిని చూచాను. ఆ దృశ్యం చూచిన వడ్రంగి ఎంతో పుణ్యాత్ముడు దృశ్యం చూడడమే గాక శ్రీ స్వామివారి యొక్క నిజస్థితిని వారి నోటినుండి వినగల్గాడు. అతడు కల్లు త్రాగుతున్నా గొప్ప పుణ్యకార్యాలు చేస్తున్న మహా మనిషై ఉంటాడు.

మద్రాసునుండి వచ్చిన భక్తురాలు మార్గమధ్యంలో దొంగలు తన కమ్మలు, ముక్కు పుడకలు దోచుకున్నారని శ్రీ స్వామి వారికి చెప్పి ఏడ్చింది. ఆమె పేదరికానికి జాలి చెందిన శ్రీ స్వామి వారు మాణిక్యం ఇంటినుండి ఒక ఇనుప ముక్క తెప్పించి దానిని చేత పట్టుకొని ఆకమ్మి వైపు చూడడంతోనే అది బంగారంగా మారిపోయింది. దానిని ఆ పేదరాలికిచ్చి నగలు చేయించుకోమన్నారు. నిత్యం శ్రీ వారికి అన్నం పెట్టే మాణిక్యానికి ఇది చూచి ఆశ పుట్టింది. అతడు నాగలి కర్రు తెచ్చి శ్రీ స్వామి వారికిచ్చి బంగారం చేయమన్నారు. అందుకు శీ స్వామి మనసు పండితే జన్మ బంగారమవుతుంది. మనసు పండకపోతే జన్మ భంగమవుతుంది అని మాత్రమన్నారు కానీ దాన్ని బంగారు చేయలేదు. నిరాశ చెందిన మాణిక్యం కొందరు స్నేహితులుతో వచ్చి శ్రీ స్వామివారిని కొట్టాలని ప్రయత్నించాడు. శ్రీ స్వామివారు మురుగా, మురుగా అని ముమ్మారు పలుకగానే ఆ నిశీ సమయములో ఒక పెద్ద నెమలి వచ్చి వాళ్ళను తన ముక్కుతో పొడుస్తుంది. వారంతా భయపడి వెళ్ళిపోయారు.

ఇన్ని రోజులు అన్నం పెట్టినా శ్రీ స్వామి తనకు బంగారు చేసే విద్య చెప్పలేదని మాణిక్యం బాగా రెచ్చిపోయి శ్రీ స్వామివారిని మంచిమాటలతో మభ్యపెట్టి బండిలో ఎక్కించుకొని మల్లవాడి తోటలోకి తీసుకవెళ్ళాడు. బంగారు చేసే విద్య చెప్పమంటే మౌనం వహించిన శ్రీ స్వామి వారి వేళ్ళను రాయితో కొట్టి హింసించాడు. అప్పుడు శ్రీ స్వామి వారు ఉండేందుకు స్థలము వెదుకు - నాశనము, నాశనము అని మాత్రమన్నారు. వారిలో ఒకడు ఆ విద్య చెప్పకుంటే చంపుతానని కత్తి చూపించాడు. వెంటనే అక్కడొక పెద్దపులి ప్రత్యక్షమై గాండ్రించింది, అందరూ చెల్లా చెదరై పరుగెత్తి వెళ్ళిపోయారు.



అలా పరుగెత్తి వారు కలశపాకం వినాయక గుడిదగ్గరకు రాత్రి 1 గంటకు చేరారు. వారికంటే ముందే శ్రీ స్వామి వారా గుడి దగ్గర కూర్చోనుండడం చూచి బిత్తరపోయారు.

ఇంత జరిగినా దురాశాపరులైన వారిలో కొంచమైన మార్పులేదు. ఎలాగైనా శ్రీ స్వామిని అంతమొందించాలని ఒక రాత్రి వేళ స్వామి వద్దకు వచ్చారు. వారు వచ్చేసరికి తల మొండెము కాళ్ళు చేతులు చెల్లా చెదురుగా రక్తపు మడుగులో పడి ఉండడం చూచి తమకంటే ముందే ఎవరో స్వామి వారిని చంపేశారని తలచి వెళ్ళిపోయారు. మరురోజు కలశపాకం వీధిలో తిరుగుతున్న శ్రీ స్వామి వారిని చూచి - వారొక గొప్ప సిద్ధపురుషులని వారిని చంపాలని ప్రయత్నించడం అపచారమని వారు తమ ప్రయత్నం విరమించుకున్నారు.

ఆశ మానవుణ్ణి ఎంతటి దర్గతి పాలుజేస్తుందో చూడండి. అంతటి గొప్ప సిద్ధపురుషునకు అన్ని రోజులుగా అహారమందించే భాగ్యం గలిగి ఎంతో పుణ్యమార్జించాడు. బొత్తిగా వివేకం లేని కారణంగా బంగారం తయారు చేసే విద్య కావాలనే ఆశ కల్గింది. ఆ ఆశ నెరవారకపోవడంతో శ్రీ స్వామి వారిని హింసించడం, చంపాలనే ప్రయత్నాలు చేయడం వంటి ఘోర పాపాలు చేశాడు. ఇలాంటి గురు ద్రోహానికి శిక్షలు కూడా భగవంతుడు గొప్పగానే వేస్తాడు. గనుక బుద్ధి వికాసం లేకుండా పుణ్యమార్జించడమొక్కటే మానవుల ధ్యేయం కాకూడదంటారు శ్రీ భరద్వాజ మాస్టర్ గారు. ఇది అక్షర సత్యం గదా!

శ్రీ స్వామివారు చేసే ఖండయోగం చూచే భాగ్యం ఎంతో పుణ్యముంటేనే కలుగుతుంది. కలశపాకం వాస్తవ్యులు తంగవేలు

నయనార్, షణ్ముఖ నయనార్ ఒకరోజు శ్రీ స్వామి వారికి ఆహారం తీసుకపోతున్నారు. వినాయకగుడి ప్రక్కన స్మశానంలో శ్రీ స్వామి వారి తల, మొండెము, కాళ్ళు, చేతులు విడివిడిగా పడి ఉండడం చూచారు. తంగవేలు నయనార్ భయపడకుండా ఆ అవయవాలకు మూడు మార్లు ప్రదిక్షిణ చేసి, దక్షిణం వైపు తల పెట్టి సాష్టాంగపడగానే రెండు కాళ్ళు అతుకుకున్నాయి. తూర్పువైపు తలపెట్టి సాష్టాంగ పడాగానే తల, మొండెము, చేతులు, కాళ్ళు అన్నీ అతుకుకొని శ్రీ స్వామి వారు పునర్జీవితులైనారు. మీరెందుకు అకాలంలో వచ్చారు? సమయం చూచి రావాలి అన్నారు. నాయనార్లు తప్పయిపోయింది, క్షమించమని అన్నం పెట్టి నమస్కరించి వెళ్ళారు. ఈ ఖండయోగం చేయడం శ్రీ వెంకయ్యస్వామి వారు, శ్రీ సాయినాధులు అందరు మహనీయులకు ఇది ఒక దివ్యలీల.

1968 వ సం||లో వర్షానికి నది వెల్లువలో ఉంది శ్రీ స్వామి వారు మూడురోజులు నదిలోనే యోగనిష్ఠలో యున్నారు. శ్రీ స్వామి వారు తడవకుండా ఉండేందుకు వేసిన పింజరం వెల్లువకు కొట్టుకపోయింది. మూడు రోజుల తర్వాత ఇసుకపైన వెంట్రుకలు కనబడుతుంటే రైతులు ఇసుకను తొలగించారు. శ్రీ స్వామి వారు ఎప్పటివలె క్షేమంగా ఉన్నారు. నది ఒడ్డున ఒక పందిరి వేసి అందులో శ్రీ వారిని కూర్చోబెట్టి అభిషేకము ఆరాధన చేశారు. అది మొదలు వారిని నది స్వామి అని పిలిచేవారు. అంతకు ముందు మురికి స్వామి, మూటలస్వామి అనే పేరుతో పిలచేవారు. క్రమంగా దర్శనానికి వచ్చే వారెక్కువైనారు. శ్రీ స్వామి ముందొక పళ్ళెము పెట్టి డబ్బులు తీసుకునేవారు. అది ఇష్టములేని శ్రీ స్వామి వారు విల్వారాణి నక్షత్రగుడిలో కూర్చో సాగారు.



1964 వ సం|| కార్తీకమాసంలో ఒక వారం రోజులు జడివాన కురిసింది. అప్పుడు శ్రీ స్వామివారు గుంటగట్టనే చోట ఒంటికాలిపై తపస్సు చేశారు. అంతటి వాన కురిసినా వారిచుట్టూ మూడడుగుల వరకు నేల పొడిగా నుండడం చూచిన ప్రజలు ఆశ్చర్యచకితులైనారు. నాటినుండి వారి మహిమ నలుదిశలా వ్యాపించసాగింది.

ఒకరోజు శ్రీ స్వామి వారు ఆది మూలం మేస్త్రిగారి కొట్టంలో కూర్చున్నారు. శివానంద మొదలియార్ అన్నం పెట్టబోతే తినవచ్చు, తినివచ్చు అని ముమ్మారు పలికారు గాని తినలేదు. మరుసటి రోజు ఉదయం 4 గంటలకు ఆదిమూలం మేస్త్రి వచ్చాడు. వేళకాని వేళలో మీరు రావద్దు, అని చెప్పి మంచి వడగండ్ల వానలో శ్రీ స్వామివారు అదృశ్యమైపోయారు.

అనేక సంవత్సరములుగా తిరుగుచూ శ్రీ స్వామివారు పూండిలో శ్రీ రాములునాయుడు గారి ఇంటి వరండాలో 1960 సం|| నుండి 1978 వ సం|| మహా సమాధి చెందే వరకు పంతొమ్మిది సంవత్సరములు ఏ అవసరార్థము లేవకుండా అక్కడే కూర్చున్నారు. అన్నపానీయాలు, మల మూత్ర విసర్జనకు కూడా లేచేది లేదు. ఎవరైన నోటిలో పెడితే ఒకటి రెండు ముద్దలు స్వీకరించేవారు. కొందరు దగ్గరకొస్తే పెద్దగా గర్జించేవారు.

తనకు దేహమున్నదన్న సంగతే మరచి గాఢ సమాధిలో ఉండేవారు. వారి జేబులో బల్లి గుడ్లు పెట్టి పిల్లలు చేస్తే అవి ఆ జేబులోనే ఉండేవి. అవి బయటికి పోతుంటే తీసి మరలా తన జేబులో వేసుకొనేవారు. అలాగే తేళ్ళు, మండ్రగబ్బలు కూడా తన జేబులో ఉండేవి.

## మలపీఠ నాయకుడు

శ్రీ స్వామి వారు పూండిలోని పెంకుటిటి వరండాలో కూర్చో సాగాక భక్తులు శ్రద్ధా భక్తులతో తన నోటికందించిన ఆహారాన్ని కొంతమంది ఇచ్చినప్పుడు మింగేవారు. కొందరిచ్చినప్పుడు స్వీకరించేది లేదు. వారు విసర్జించిన మలము మైనము వలె ఉంటూ దుర్వాసన లేకుండా పునుగు జవ్వాజి వంటి సుగంధ ద్రవ్యముల వాసన వెదజల్లేది. ఆ మలము ఒక పీఠమువలె ఆ అరుగుపై పేరుకపోయింది. కొంత అరుగువెంబడి కారేది. ఆ పీఠముపై శ్రీ స్వామివారు ఎప్పుడూ ఉండడముచే పీఠము పెరిగినందున శ్రీ స్వామి వారి తల వరండా కప్పుకు తగలసాగింది. అప్పుడు భక్తులు గడ్డ పారలతో ఆ మలపీఠాన్ని త్రవ్వి తీసేశారు. అందుచే శ్రీ స్వామి వారికి మలపీఠ నాయకుడనే పేరు వచ్చింది. త్రిమలాలను అంతమొందించిన మహనీయుడు గదా మన మలపీఠనాయకుడు.

అది ఒక తుఫాను రాత్రి. చెట్లు వేళ్ళతో సహా పెకలించుకొని పడిపోయి ఉన్నాయి. గాఢాంధకారమైన చీకటి. వర్షము కురుస్తుంది. ఒక రైతు తప్పిపోయిన ఆవును వెతుక్కుంటూ శ్రీ స్వామి వారుండే ఇంటి సమీపానికి వచ్చాడు. శ్రీ స్వామి వద్ద తాను చూస్తున్న దృశ్యము నిజమా, నాభ్రమా అని అతడు అలాగే నిలబడిపోయాడు. గ్రామమంతా ఘాడంధకారమైన చీకటి, శ్రీ స్వామి వారి దగ్గర మాత్రము దేదీప్యమానమైన వెలుగు ఉంది. ఆ వెలుగులో 6 అడుగుల పొడవుగల అందమైన అజానుబాహుడు వింజామరతో శ్రీ స్వామివారికి విసురుతున్నాడు. ఆ రైతు భయపడి ఇంటికి పరుగెత్తాడు.

ఇదే విధంగా మరొక రోజు రాత్రి 8 గంటలకు బాగా వర్షము, తుఫానుగా ఉంది. నిశ్శబ్దము తాండవమాడు ఆ సమయంలో ఒక భక్తుడు శ్రీ స్వామి వారికి వేడి వేడి జొన్న సంగటి సమర్పించాలని



తెస్తున్నాడు. శ్రీ స్వామి వారు 10, 15 పాముల పడగలపై కూర్చొనియున్న దృశ్యం గోచరిస్తుంది. ఆ రైతు కొంత దూరంలో నిలబడిపోయాడు. శ్రీ స్వామి వారి నుండి నరుడు వస్తున్నాడు, నరుడు వస్తున్నాడు అనే శబ్దము ఆ రైతుకు వినిపిస్తుంది. అక్కడ పాములుంటే మనిషి గొంతెలా విన్పిస్తుందనేది అతనికి బోధ పడలేదు. ఇంతలో మరొక రైతు లాంతరు తీసుకొని అక్కడికి వచ్చాడు. మొదటి వ్యక్తి తనకు కన్పించిన దృశ్యం సంగతి చెపితే అక్కడ పాములు లేవు ఏమీ లేవు వెళ్ళమన్నాడు. పాములున్నాయని భయపడ్డ రైతు శ్రీ స్వామి వారికి సంగటి పెట్టే మాటే మరచిపోయి ఇంటికి వెళ్ళాడు. తెల్లవారి విచారిస్తే రాత్రి లాంతరు తెచ్చిన రైతు ఆ గ్రామములోనే లేరని తెలిసింది. రాత్రి పాముల రూపంలోనూ, లాంతరు తెచ్చిన రైతు రూపంలోనూ వచ్చిన సిద్ధపురుషులెవరైంది శ్రీ స్వామివారికే తెలియాలి.

శ్రీ స్వామి వారి మహా సమాధికి నాలుగు రోజుల ముందు చింతామణి మరియు నారాయణ వడయార్ అనే భక్తులు వచ్చి శ్రీ స్వామి వారిని విభూతి అడిగారు. అప్పుడు శ్రీ స్వామి వారన్నారు - ఎంత కాలము మీరు ఈ విధంగా అడుగుతారు. ఇప్పటి వరకు మీరు చెప్పినవన్నీ విన్నాను. ఇకనుంచి నేను చెప్పేది మీరు వినాలి అని అన్నారు. వారినే అక్కడున్న విభూతి తీసుకొని వెళ్ళమన్నారు. ఆ తరువాత నాలుగు రోజులకు శ్రీ స్వామివారు మహాసమాధి చెందారు.

అదేరోజు పూండిలోని నాయుడమ్మ కూడా శ్రీ స్వామివారి ఆశీస్సులకై వచ్చి ప్రార్థించింది. శ్రీ స్వామివారన్నారు - నేను కొలిచి ఇచ్చేందుకు సిద్ధముగా ఉన్నాను. కానీ తీసుకవెళ్ళే వారే లేరు. గనుక నేను దుకాణం మూసి వేయాలనుకుంటున్నాను. ఆమెకు విభూతి నివ్వకుండా పంపేశారు. నాలుగు రోజుల తర్వాత శ్రీవారు మహాసమాధి చెందారు.

శ్రీ స్వామి వారు - నేను కొలిచి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను అని అన్నారు. మన దగ్గర ఉండే భక్తి, విశ్వాసము, పుణ్యము వీటినిబట్టి వారు మనలను అనుగ్రహిస్తారన్నమాట అంతే కానీ సాయిచరిత్రలో ఒక ధనవంతుడు వచ్చి నాకు జ్ఞానాన్ని ఇస్తే వెళ్ళిపోతానని తొందర పడ్డప్పుడు సాయి చెప్పిందే మనందరికీ వర్తిస్తుంది. ఈ భావాన్నే శ్రీ వెంకయ్య స్వామి వారు - మైసూరు మహారాజును చూస్తే మనకేమొస్తుందయ్యా. మనం చేసుకున్నదే గదా మనకు అన్నమాటకు సరిపోతుంది. గనుక మనం మానవ లక్షణాలు అలవరచుకొని ఆశతో ఇతరులకు కష్టం కలిగించకుండా జీవించడం నేర్చుకుంటే దైవకృప పొందగలుగుతాము. ఇతర జీవులలోని పరమాత్మను గుర్తుపెట్టుకొని మన విధిని ధర్మబద్ధంగా నెరవేర్చడం అలవాటు చేసుకోమని శ్రీ స్వామి వారు బోధిస్తున్నారు.

శ్రీ స్వామివారు మహాసమాధి చెందేందుకు రెండు రోజులముందు వారికి స్నానం చేయిస్తున్నారు. అప్పుడు శ్రీ స్వామివారు "నన్నెందుకు కూర్చోబెడుతారు. పడుకోనివ్వండి, ఒక్కసారిగా అభిషేకము చేయవచ్చు" అని అన్నారు. ఈ మాటలద్వారా రెండు రోజుల తర్వాత జరుగనున్న తన మహా సమాధిని సూచించారు. మహా సమాధి చెందేరోజు ఉదయం ఇలా అన్నారు. "పూరం, పూరదమ్, అనుషమ్" అంటే గురువారం తర్వాత శుక్రవారము అనూష నక్షత్రమని అర్ధము. అదే విధంగా వారు 1978 వ సం|| నవంబరు 3వ తేది శుక్రవారం - త్రయోదశి అనూష నక్షత్రము ఉదయం 9 గం. 40 ని|| లకు మహా సమాధి చెందారు. అనంత కోటి భక్తులే గాక దేవతలు కూడా శోక సాగరంలో మునిగిపోయారు. ఆ మహనీయుని భౌతికకాయాన్ని 03-11-1978 నుండి 05-11-1978 వరకు భక్తుల దర్శనార్ధం ఉంచారు. వేలమంది భక్తులు, అనంతకోటి దేవతలు నివాళులిస్తుండగా ఆ మహనీయుని భౌతికకాయాన్ని పుష్పమాలలతో అలంకరించి గ్రామోత్సవము చేసి సమాధి చేశారు. ఈ మహనీయుడు నేటికీ భక్తుల మొర ఆలకించి రక్షిస్తున్నారనేందుకు వారి సమాధి వద్ద జరిగే శ్రద్ధా భక్తులతో కూడిన కార్యక్రమాలే నిదర్శనము.



## మహా సమాధి అనంతరం దివ్యలీల

శ్రీ పూండి స్వామి వారిని తరచుగా దర్శించే మధురై దంపతులు తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి వారి దర్శనార్ధం వచ్చారు. ఆ రోజు ఉదయం సముద్ర స్నానం చేసి వస్తుండగా మందిరం ప్రక్కనున్న గోడమీద కూర్చొని శ్రీ పూండి స్వామి వారు కనిపించారు. పూండి నుంచి ఎప్పుడు వచ్చారు స్వామీ? ఇక్కడ ఒంటరిగా ఎందుకు కూర్చున్నారు? మాతోటి లాడ్జికిరమ్మని ప్రార్ధించారు. అప్పుడు స్వామి - నాకు ఇద్దరు కొడుకులున్నారు. ఒకడు టైలర్, ఇంకొకడు టీచర్. ఇద్దరూ నా గురించి పట్టించుకోలేదు. గనుక తిరువణ్ణామలై నుంచి పూండి వచ్చాను, అక్కడ కూడా ఎవ్వరూ నన్ను గురించి పట్టించుకోలేదు. నేను కొల్లిమలై వెళ్ళాను. అక్కడా అంతే. కాబట్టి ఇక్కడకు వచ్చాను. నేను హిమాలయాలకు వెళ్ళాలనుకుంటున్నాను అని చెప్పారు వారు. శ్రీ స్వామి వారికి ఆహారమిచ్చి తినిపించారు.

వారు మందిరానికి వెళ్ళారు. సాయంత్రం వార్తా పత్రికలలో శ్రీ పూండి స్వామి వారు సమాధి చెందినట్లు వ్రాసియుండడం చదివారు. వారు ఉదయం శ్రీ స్వామి వారిని చూసిన స్థలమంతా వెదికారు. ఎక్కడా కనిపించలేదు. వారు పూండికి వచ్చి వారి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ విధంగా మహా సమాధి అనంతరం కూడా తన భక్తులకు దర్శనమిస్తూ వారి సంకటములను తీరుస్తూ భక్త రక్షణ చేస్తూనే యున్నారు. మహనీయులకు ఆద్యంతములు ఉండవు కదా! ఈనాటికీ వారి సమాధివద్ద భక్తి శ్రద్ధలతో సేవలు చేసుకునే భక్తులు ఉన్నారు. వారు తమ దివ్యానుభవాలను చెప్పను భయపడుతున్నారు. కానీ వారికేదివ్యానుభవాలు లేనిదే అంతటి భక్తి శ్రద్ధలతో సమాధికి సేవలు చేయలేరు.

సర్వేజనా సుఖినోభవంతు
లోకాన్ సమస్తాన్ సుఖినోభవంతు